


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ | 11-04-2026 శనివారం | సంపుటి : 27 | సంచిక : 39 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on

# ఆర్టీసీలో డిఎ

## ఈ యేడాది జనవరి 1 నుంచి

## 2.1 శాతం

### ఏప్రిల్ నెల జీతాలతో బకాయిలు

### 38 వేల మంది కార్మికులు, సిబ్బందికి లబ్ధి ● నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం : మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఎఎంఎస్) :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఆర్టీసీ కార్మికుల కరువు భత్యాన్ని (డీఏ) 2.1 శాతం పెంచుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రకటించారు. తాజా పెంపుతో ఇప్పటివరకు 50.7 శాతంగా ఉన్న డీఏ, ఇప్పుడు 52.8 శాతానికి చేరింది.పెరిగిన ఈ డీఏ ఈ ఏడాది జనవరి ఒకటో తేది నుంచి అమల్లోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గత మూడు నెలల (జనవరి, ఫిబ్రవరి, మార్చి) బకాయిలను ఏప్రిల్ వేతనంతో పాటే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపుతో సంస్థపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం పడనుంది.



**పెండింగ్ డీఏలన్నీ క్లియర్..** గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డీఏలన్నింటినీ తమ ప్రభుత్వం వరుసగా విడుదల చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మిగతా 2లో

# షాక్‌లో పాక్ చర్చలు

### ఇస్లామాబాద్ కు మా ప్రతినిధులు వెళ్లలేదు : ఇరాన్

### చర్చలకు అడ్డంకిగా లెబనాన్ సంక్షోభం

### పాక్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :** తమ దేశ ఉన్నతాధికారులు అమెరికాతో చర్చల నిమిత్తం పాకిస్తాన్‌కు వెళ్లారంటూ వచ్చిన వార్తలను ఇరాన్ ప్రభుత్వ మీడియా శుక్రవారం తీవ్రంగా ఖండించింది. దీనితో ఇస్లామా బాద్‌లో జరుగవలసిన శాంతి చర్చల విషయంలో అనిశ్చితి నెలకొంది. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ టెహ్రాన్‌లోనే ఉన్నారని, దేశం విడిచి వెళ్లలేదని ప్రెస్ టీవీ, తస్నీమ్ న్యూస్ ఏజెన్సీని ఉటంకిస్తూ వెల్లడించింది. పాకిస్తాన్‌కు ఇరాన్ ప్రతినిధి బృందం చేరుకుందన్న వాదనలను ఖండిస్తూ, అధికారులు దేశంలో తమ విధులను కొనసాగిస్తున్నారని అది పేర్కొంది.

**లెబనాన్ దాడుల నేపథ్యంలో చర్చలు నిలిపివేత : తెహ్రాన్**

మీడియా నివేదికలను పూర్తిగా అవాస్తవం అని కొట్టిపారేస్తూ, ఏ ఇరాన్ సంప్రదింపుల బృందం కూడా ఇస్లామాబాద్‌కు చేరుకోలేదని తస్నీమ్ ఉటంకించిన అధికారి తెలిపారు. వాషింగ్టన్‌తో ఎలాంటి సంప్రదింపులైనా లెబనాన్‌లోని పరిణామాలపై ఆధారపడి ఉంటాయని ఆ అధికారి పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణకు అమెరికా కట్టుబడనంత కాలం, జియోనిస్ట్ పాలకులు తమ దాడులను కొనసాగించినంత కాలం, చర్చలు నిలిచిపోతాయి, అని ఆ వర్గాలు తెలిపాయి. ఇరాన్ ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ పటిష్ఠంగా అమలయ్యే వరకు అమెరికాతో చర్చల్లో పాల్గొనే ప్రణాళికలు తెహ్రాన్‌కు లేవని పేర్కొంది. పరస్పర విరుద్ధ సంకేతాలతో గందరగోళంగురువారం రాత్రి ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు చేరుకుందని పేర్కొన్నది వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక తర్వాత ఈ ఖండన వెలువడింది.

మిగతా 2లో



“గణపతి అడవిలో లేదు అనారోగ్యం వల్ల బయటే ఉన్నాడు”

# నిషేధం ఉండాల్సిందే

### 42 మంది మావోయిస్టుల లొంగుబాటు సందర్భంగా ఆ పార్టీ భవిష్యత్తుపై డిజిపి శివధర్ రెడ్డి వ్యాఖ్య

### పీఎల్‌జీఏ బెటాలియన్ రాష్ట్రంలో కనుమరుగైందని వెల్లడి, క్రియాశీలక మావోయిస్టులు ఎవరూ లేరు

**హైదరాబాద్,ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయాలనడం సరి కాదని డీజీపీ బి.శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పోరాడటానికి, ప్రజల్లో ఉండి పని చేయడానికి ఏ రాజకీయ పార్టీతోనో లేదా సాయుధ సంస్థలతోనో సంబంధం ఉండాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా సేవ చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న సాయుధ పోరాటానికి తెరదించుతూ.. పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు 42 మంది తమ ఆయుధాలతో శుక్రవారం డీజీపీ బి.శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ భారీ లొంగుబాటుతో తెలంగాణలో పీఎల్‌జీఏ బెటాలియన్ పూర్తిస్థాయిలో కనుమరుగైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో క్రియాశీలక మావోయిస్టు కేడర్ ఎవరూ లేరన్నారు. దీనితో తెలంగాణ ఇప్పుడు పూర్తిస్థాయిలో 'మావోయిస్టు రహిత' రాష్ట్రంగా అవతరించిందని ప్రకటించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అడవుల్లో గడిపిన జీవితం కంటే, జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాతే వారి జీవితాలు బాగున్నాయని చెప్పారు. అడవుల్లో ఇంకా మిగిలి ఉన్న వారు కూడా వెంటనే ఆయుధాలు వీడి లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ కీలక నేత గణపతి ఇంకా బతికే ఉన్నారని స్పష్టం చేశారు. అయితే ఆయన ప్రస్తుతం అడవుల్లో లేరనీ అనారోగ్య సమస్యల రీత్యా ఎప్పుడో అడవినీ వీడినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. మరోవైపు కొంతమంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత బయటకు వెళ్లి తాము అరెస్ట్ అయ్యామని చెప్పుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మేం లొంగిపోలేదు, పోలీసులు మమ్మల్ని అరెస్ట్ చేశారని కొందరు బయట ప్రచారం చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు.



మిగతా 2లో

# అన్నా! దేవుడే నీ వద్దకు పంపాడు



- తెలంగాణకు అన్యాయం జరుగుతోంది
- మీతో కలిసి పని చేసేందుకే ఇక్కడి వచ్చిన
- భావోద్వేగానికి లోనయిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో కేసీఆర్‌తో భేటీ
- జీవన్ బృందానికి బీఆర్ఎస్ నేతల ఘన స్వాగతం

2

# జస్టిస్ వర్మ రాజీనామా

### నగదు లభ్యత వివాదంలో కొనసాగుతున్న విచారణ

**అలహాబాద్, ఏప్రిల్ 10 (వుదయం) :** యావత్ దేశ దృష్టిని ఆకర్షించిన ఒక అవినీతి వివాదం జస్టిస్ యశ్వంత వర్మ రాష్ట్రపతికి తన రాజీనామాను పంపడంతో మలుపు తిరిగింది. జస్టిస్ యశ్వంత వర్మ అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా ఉన్నారు. జస్టిస్ వర్మ రాజీనామా తన నివాసంలో నగదు లభ్యమైనట్లు ఆరోపణలు వెలుగుచూసిన నేపథ్యంలో, న్యాయమూర్తి వర్మ ఇటీవల ఢిల్లీ హైకోర్టు నుండి తిరిగి అలహాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ విషయంపై పెరుగుతున్న ఆందోళనల నడుమ, ఈ చర్యను ఒక పరిపాలనాపరమైన చర్యగా పరిగణించారు. బదిలీ అనంతరం, ఆయన ఏప్రిల్ 5, 2025న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయినప్పటికీ, ఆ వివాదం ఆయన్ని వెంటాడుతూనే ఉంది.



**పార్లమెంటరీ చర్యకు అవకాశం**

ఆయన రాజీనామాకు ముందు, ఈ కేసుకు సంబంధించి పార్లమెంటు తొలగింపు చర్యలు చేపట్టే అవకాశంపై చర్చలు జరిగాయి. భారతదేశంలో, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులను పార్లమెంటు ప్రమేయం ఉన్న కఠినమైన ప్రక్రియ ద్వారా మాత్రమే తొలగించగలరు, అందువల్ల ఇటువంటి పరిణామాలు అరుదైనవి. తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి.

**యశ్వంత్ వర్మ ఎవరు?**

జస్టిస్ యశ్వంత్ వర్మ జనవరి 6, 1969న జన్మించారు. ఆయన 1992లో రేవా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు, అదే సంవత్సరం ఆగస్టు 8న న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. తన వృత్తి జీవితపు తొలినాళ్లలో, ఆయన ప్రధానంగా సివిల్ (పౌర) సంబం ధిత కేసులను వాదించారు.

మిగతా 2లో

# ఏఐతో పెరిగిన రాబడి

### మైనింగ్, రవాణాలో ఆదాయం పెంచుకోగలిగాం

### 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం : డిప్యూటీ సిఎం భట్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం, వివిధ శాఖల్లో పన్నుల ద్వారా వస్తున్న ఆదాయంపై నిరంతరం సమీక్ష, పకడ్బందీ నిర్వహణతో వివిధ శాఖల్లో ఆదాయం పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రెవిన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామని తెలిపారు. అధికారులు మరింత పకడ్బందీగా పనిచేసి ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్ లోడ్ వంటి అంశాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. నిరంతరం సమీక్షలు, పన్ను ల నిర్వహణలో పకడ్బందీ చర్యల మూలంగా కమర్షియల్ టాక్స్ శాఖలో జీఎస్టీ ఆదాయం గత మూడు నెలలుగా 15శాతం పెరుగుదల కనిపించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ శాఖలో సైతం ఆదాయంలో పెరుగుదల కనిపించిందని తెలిపారు. ఆదాయం ఓనర్లు పెంచుకునేందుకు ప్రతి శుక్రవారం రెవిన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు.

మిగతా 2లో

# లెబనాన్‌పై భారత్ ఆందోళన

- పౌరుల రక్షణే మా ప్రాధాన్యమని స్పష్టీకరణ

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :** పశ్చిమ ఆసియాలో నెల రోజులుగా కొనసాగుతున్న సంఘర్షణకు ముగింపు పలికే లక్ష్యంతో రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, ఇజ్రాయెల్ దాడులు కారణంగా లెబనాన్‌లో పెరుగుతున్న పౌర మృతుల సంఖ్య పట్ల భారతదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పౌరుల రక్షణే తమ ప్రధాన ప్రాధాన్యత అని నొక్కి చెప్పింది. న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, ఈ పరిస్థితి చాలా ఆందోళనకరమైనదని అభివర్ణించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పట్ల భారతదేశానికి ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుతం లెబనాన్‌లో సుమారు 1,000 మంది భారత జాతీయులు నివసిస్తున్నారని కూ డా ఆయన పేర్కొన్నారు. లెబనాన్ లో భారీ సంఖ్యలో



మిగతా 2లో

# డ్రగ్స్ నిందితులకు మరి రెండు రోజుల కస్టడీ

**రంగారెడ్డి, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** మెయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మల కస్టడీని ఉప్పర్ పల్లి కోర్టు మరో రెండు రోజులు పొడిగించింది. ఆ లోపు నిందితులను విచారించాలని ఆదేశించింది. మూడోసారి రెండు రోజుల పోలీసు కస్టడీ విచారణ పూర్తి చేసిన అనంతరం ఈ ముగ్గురినీ పోలీసులు శుక్రవారం ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలు పరిశీలించిన న్యాయస్థానం ఐదు రోజులు మంజూరు చేయకుండా మరో రెండు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చిం ది. ఈ నేపథ్యంలో పోలీసులు మిగిలిన రోజుల్లో మరింత కీలక సమాచారం సేకరించేందుకు విచారణను వేగవంతం చేయనున్నారు. ఇప్పటికే ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న సిట్ అధికారులు ప్రధానంగా పైల ట్ రోహిత్ రెడ్డి, మరో ఇద్దరు నిందితుల బ్యాంకు లావాదేవీలపై లోతుగా విచారణ చేశారు. దుబాయిలో నిందితులకు సంబంధించిన అకౌంట్లు గుర్తించారు. ఇప్పటి వరకు జరిగిన విచారణలో నిందితులు అనేక ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్లు సమాచారం.




మిగతా 2లో

# పాలమూరు ప్రాజెక్టులపై హరీశ్ రావు అబద్ధాలు

### ఇచ్చింది మూరెడు, చెప్పుకుంటున్నది బారెడు

### గొల్లపల్లిపై అసత్య ప్రచారం : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ద్వంద్వ నీతిని అవలంబిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వమే గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి జీవోలు ఇచ్చి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డు తగలుతోందని విమర్శించారు. శుక్రవారం సీఎల్పీలో ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016లో 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.4,177 కోట్లతో జీవో ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జూపల్లి గుర్తు చేశారు. 2019 మార్చిలో గొల్లపల్లితో సహా 27 రిజర్వాయర్లను ప్రతిపాదించి, ఇప్పుడు అదే ప్రాజెక్టు వద్దని మాట్లాడటం పాలమూరు ప్రజలను వంచించడమే అన్నారు. కృష్ణా జలాల్లో 811 టీఎంసీ నీళ్లు ఉభయ రాష్ట్రాలకు కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే.. కేసీఆర్ సంతకం చేసి అన్యాయం చేశారన్నారు. శ్రీశైలంలో నీళ్లు లేని సమయంలో వాడుకోవడానికి రిజర్వాయర్లు అవసరమని గతంలో తాము మొత్తుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు.



**పాలమూరు రంగారెడ్డి పనులపై అవాస్తవాలు**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు

మిగతా 2లో


# భూములు కాపాడండి

### రూ. కోట్లు విలువ చేసే భూమిని ఓ మాజీ కబ్జాకు ప్రయత్నం

### బౌన్సర్లను పెట్టి 600 మంది రైతులను బెదిరిస్తున్నారు

### నాదర్‌గుల్ 'కబ్జాల'పై రంగారెడ్డి జిల్లా

### అడిషనల్ కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఎఎంఎస్) :** రంగారెడ్డి జిల్లా నాదర్గుల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 673లో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ. కోట్లు విలువ చేసే 373 ఎకరాలను ఓ మంత్రి కబ్జాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బౌన్సర్లను అడ్డం పెట్టుకొని ఆరొందల మంది రైతులను ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేలా బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ పరంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అక్రమార్కులు ల్యాండ్ చుట్టూ రేకులతో భారీకేడ్లు

మిగతా 2లో

# పకడ్బందీగా పథకాల అమలు

- కేంద్ర పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి
- అన్ని శాఖలు సమిష్టి, సమన్వయంతో పని చేయాలి
- హైదరాబాద్ మహానగరాన్ని రోల్ మోడల్ గా నిలపాలి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎం స్వనిధి యోజన, పీఎం విశ్వకర్మ, స్వచ్ఛభారత అభియాన్, పి.ఎం ఆవాస్ యోజన, పి.ఎం ముద్ర లోన్స్, స్టాండ్ ఆఫ్ ఇండియా, పీఎం జన్ ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, సమగ్ర శిక్ష అభియాన్, పి ఎం శ్రీ , పీఎం కౌశల్ వికాస్ యోజన , పీఎం ఉజ్వల యోజన , ఆయుష్మాన్ భారత్, వయా వందన యోజన, స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ లోని ఎంసిహెచ్ఆర్డీ తుంగభద్ర శ్రావణ్ కుమార్ హాల్ లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ )లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి., జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, దిశా కమిటీ సభ్యులతో కలిసి పథకాల అమలుపై మంత్రి శాఖల వారీగా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం దూరదృష్టితో బాలికల ఆరోగ్య పరిరక్షణకై 14 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా హెచ్ పి వి వ్యాక్సిన్ ను అందిస్తామన్నారు.

మిగతా 2లో



# నిషేధం ఉండాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ఏదేమైనా వారు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు, అదే సంతోషం అని వ్యాఖ్యానించారు. తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే క్రమంలో పోలీసుల వ్యూహాలు ఫలించాయన్న ఆయన ఇకపై శాంతిభద్రతల పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్ఐఏ నోటీసులతో తెలంగాణ పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఒక కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు ఎవరిని విచారించాలనుకుంటున్నారో వారికి నోటీసులు ఇస్తున్నారన్నారు. అది వారి పరిధిలోని అంశం అని తెలిపారు.

**ఆయుధాల అప్పగింత..** లొంగిపోయిన మావోయిస్టులు తమ వెంట తెచ్చిన సుమారు 40 అత్యాధునిక ఆయుధాలను డీజీపీకి అప్పగించారు. లొంగిపోయిన 42 మందిలో 41 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఇటీవల భద్రతా బలగాల కూంబింగ్ తీవ్రతరం కావడంతో, తెలంగాణ సురక్షితమైన ప్రాంతంగా భావించి తెలంగాణ పోలీసులను ఆశ్రయించినట్లు మావోయిస్టులు తెలిపారు.

పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు
మావోయిస్టు పేరు/వయసు

1. సోడి మల్ల అలియాస్ కేపాల్ @ నిఖిల్ (47)
2. మడవి మాడ అలియాస్ రవీందర్ (30)
3. పునేం సుక్కు (35)
4. హేమ్లా లచ్చి అలియాస్ మాసే అలియాస్ శీల (40)
5. సోడి భీమా అలియాస్ రంజిత్ (25)
6. తాటి రాజు అలియాస్ రంజిత్ (28)
7. కోవ్యాసి రాజు అలియాస్ రమేష్ (28)
8. మూడియం భీమా అలియాస్ రింకు (26)
9. మడకం భీమా అలియాస్ సునిత (28)
10. పొడియం గంగి అలియాస్ సుందరి (25)
11. సోడి భీమి అలియాస్ మాలతి (30)
12. కుడం దేవి (24)
13. మడకం జోగి (28)
14. పునేం ఐతె అలియాస్ పార్వతి (27)
15. పొడియం సుంబారి అలియాస్ అంజలి (20)
16. మడకం ఇడుమ అలియాస్ నరేష్ (24)
17. కుంజం భీమా (23)
18. మడకం ఇడుమ (23)
19. మడవి జోగా (25)
20. కుంజం సోను అలియాస్ నవీన్ (20)
21. పునేం సోము అలియాస్ రాకేష్ (20)
22. చాప నారాయణ అలియాస్ గజేందర్ అలియాస్ మధు (40)
23. కడి సన్ను అలియాస్ మంతు (40)
24. మోడియం మున్ని అలియాస్ మంజుల (43)
25. కుంజం ఇడుమాల్ అలియాస్ మహేందర్ (30)
26. సుపో డొంగ అలియాస్ సునీల్ (30)
27. పొడియం లక్ష్మి (28)
28. ముస్సాకీ దేవే (30)
29. దొడ్డి సోముడు అలియాస్ శంకర్ (26)
30. మడవి సోమిడి అలియాస్ లత (23)
31. కరటం ఉరే అలియాస్ రంజిత (22)
32. పునేం రామే అలియాస్ క్రాంతి (20)
33. పునేం మొట్టు అలియాస్ జగ్గు (30)
34. దొడ్డి ఐతు అలియాస్ కిశోర్ (40)
35. గోన్నే హిడిమె (22)
36. కుంజం లచ్చు (28)
37. పూనేం శాంతి అలియాస్ సునీత (30)
38. మడకం బుద్ర (45)
39. కుంజం భీమా (30)
40. మడకం ఉంగి (21)
41. రవ్వా సన్నా అలియాస్ గుడ్డు (18)
42. ఆప్కా శ్రీను (20).

# ఏఐతో పెరిగిన రాబడి

మొదటి పేజీ తరువాయి

2047 వరకు త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్న మేరకు అన్ని శాఖలు ఆదాయ సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల విక్రయానికి సంబంధించి ప్రపంచ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ అంశంపై అందరికీ ముందస్తుగా సమాచారం అందడం మూలంగా ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంటుందని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేసి అధ్యయనం పూర్తి చేశారన్నారు. ఆ కమిటీల నివేదికలను ముందుగా సబ్ కమిటీకి సమర్పించి ఆ తర్వాత క్యాబినెట్ కు నివేదించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మెట్రో రైల్ స్వాధీనం, నిర్వహణ, ఆదాయ, వ్యయ మార్గాలపైన అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్, రెవిన్యూ, పరిశ్రమల శాఖలోనూ ఆదాయం పెంపునకు సంబంధించి చేపట్టిన చర్యలు ఫలితాలపై మంత్రులు సమీక్ష చేశారు. ప్రతి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వాటి ఫలితాలు యాక్షన్ టేకెన్ రిపోర్టు తో తదుపరి సమావేశానికి రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, సభ్యసాచి ఘోష్, శ్రీధర్, ఎలంబర్తి శశాంక పాల్గొన్నారు.



# ఆర్టీసీలో డీఏ

మొదటి పేజీ తరువాయి

తాజా పెంపుతో ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలన్నీ పూర్తయ్యాయన్నారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అందుకే కారుణ్య నియామకాలు, విధులకు దూరమైన వారిని తిరిగి తీసుకోవడం, ఆర్టీసీ ఆస్పత్రి ఆధునీకరణ లాంటి ఎన్నో చర్యలు చేపట్టామని ఆయన గుర్తుచేశారు. ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి, ఇతర ఈడీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ డీఏ పెంపు నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల ఎండీ నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఇది సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెరిగిన ఆదాయం..** గత ఏడాది జులైలో ఆర్టీసీ ఉద్యోగుల డీఏను 2.1 శాతం పెంచారు. సాధారణంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఏడాదికి రెండుసార్లు చొప్పున డీఏ పెంచుతారు. నిబంధనల ప్రకారం ఏటా జనవరి, జులై నెలల్లో ఈ డీఏ పెంపు అమల్లోకి వస్తుంది. అయితే ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి, ఇతర కారణాలతో డీఏ పెంపు నిర్ణయం కొన్నిసార్లు ఆలస్యం అవుతుంది. అలాంటప్పుడు ప్రభుత్వం బకాయిలతో కలిపి డీఏ విడుదల చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంచినప్పుడు దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉద్యోగులకు డీఏ పెంచుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నది. దీంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల నాటికి ఆర్టీసీకి సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభం వచ్చింది. అయితే ఉద్యోగుల బకాయిలు, అప్పుల కారణంగా ఆర్టీసీపై భారం పడుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లిస్తోంది. దీంతో సంస్థ కార్యకలాపాలకు నిధుల సమస్య ఉండటం లేదు. కొత్త బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా లాభాలను పెంచుకోవడానికి ఆర్టీసీ ప్రయత్నిస్తోంది.

## పాలమూరు ప్రాజెక్టులపై
# హరీశ్ రావు అబద్ధాలు

మొదటి పేజీ తరువాయి

చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. రూ. 80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ. 25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదు, భూసేకరణ లేదు, పరిపాలనా అనుమతులు లేవు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. 50 టీఎంసీల మల్లన్న సాగర్ కోసం రైతులను ఈడ్చి పారేసి ప్రాజెక్టు కట్టిన హరీశ్‌రావుకు పాలమూరు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికి, దోసుకోవడానికే గత ప్రభుత్వం ప్రాజెక్టులను వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు కంపెనీ చేపట్టిన కల్వకుర్తి ప్యాకేజీ 29 పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టులపై తాము ఎక్కడైనా చర్చకు సిద్ధమని, హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ విసిరారు.

**గత ప్రభుత్వంలో నాపై అక్రమ కేసులు**

గత పదేళ్లలో అక్రమ కేసులు పెట్టి ప్రజాస్వామ్యం గొంతు నొక్కారని, ఆ కేసుల విషయంలో తానే బాధితుడినని జూపల్లి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడటం లేదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు కాబట్టే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, కానీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు

# షాక్‌లో పాక్ చర్చలు

మొదటి పేజీ తరువాయి

ఈ గందరగోళానికి తోడు, టెహ్రాన్ ప్రతిపాదనల ఆధారంగా చర్చల కోసం 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం వస్తుందని పాకిస్తాన్‌లోని ఇరాన్ రాయబారి రెజా అమీర్ మొఘదం ఇంతకుముందు ఎక్స్‌లో సూచించారు. అయితే, ఆ పోస్ట్‌ను తర్వాత తొలగించడంతో, ఈ పర్యటన స్థితిపై ఊహాగానాలు మరింత పెరిగాయి.

**కీలక ప్రతిబంధకంగా మారిన లెబనాన్ సంక్షోభం**

లెబనాన్‌లో హింస తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ అనిశ్చితి నెలకొంది. ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడులపై టెహ్రాన్ తీవ్రంగా స్పందించింది. దాడులు కొనసాగితే దౌత్య ప్రయత్నాలకు ఆటంకం కలగవచ్చని ఇరాన్ అధికారులు హెచ్చరించారు. ఈ పరిస్థితి పట్ల అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇంతకుముందే ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇరాన్ లెబనాన్‌ను విడిచిపెట్టదని హెచ్చరించారు. మా చేతులు ఇంకా ట్రిగర్‌పైనే ఉన్నాయి. ఇరాన్ తన లెబనీస్ సోదర సోదరీమణులను ఎప్పటికీ విడిచిపెట్టదు, అని ఆయన అన్నారు

# పాక్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :** పాకిస్తాన్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాల మధ్య జరగనున్న చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎయిర్ ఫోర్స్ టూ విమానంలో బయలుదేరారు. తాము చర్చల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని విమానం ఎక్కే ముందు ఆయన అన్నారు. ఇరానీయులు సద్భావనతో వ్యవహరిస్తే, అమెరికా వారికి స్నేహ హస్తం అందించడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అయితే, వారు తమని మోసం చేయడానికి ప్రయత్నిస్తే, అమెరికా అందుకు సానుకూలంగా స్పందించదని కూడా ఆయన స్పష్టం చేశారు. చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు మార్గదర్శకాలు ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ చర్చలు పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో శనివారం ప్రారంభమవుతాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఇంతకుముందు ప్రకటించారు. వాన్స్‌తో పాటు ప్రత్యేక దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొంటారు. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాక కోసం ఇస్లామాబాద్ ఇంకా వేచి చూస్తోందని పాకిస్తాన్‌లోని మీడియా పేర్కొంటోంది.

# భూములు కాపాడండి

మొదటి పేజీ తరువాయి

నిర్మించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాదర్గుల్‌లోని 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ బీఆర్ఎస్ నేతలు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. కోర్టులకు సంబంధించిన భూముల్లో, రైతులకు భూముల్లోని బోర్లను పగలకొట్టడం, వ్యవసాయం చేసుకొనే రైతులను కొడుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ భూములలో కాంగ్రెస్ నాయకులు అక్రమ షెడ్లు వేస్తుంటే అధికారుల చర్యలు తీసుకోకపోవడంపై అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ ఘటనపై స్థానిక ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. రూ. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ ప్రభుత్వ భూములను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాపాడాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బృందంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజ్ శ్రావణ్, వాణిదేవి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య, పట్నం నరేందర్ రెడ్డి ఉన్నారు.

# లెబనాన్‌పై భారత్ ఆందోళన

మొదటి పేజీ తరువాయి

పౌర మరణాలు సంభవించినట్లు వస్తున్న నివేదికల పట్ల తాము తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని ఆయన అన్నారు. లెబనాన్ శాంతి, భద్రతలకు కట్టుబడి ఉన్న ఐక్యరాజ్య సమితి తాత్కాలిక దళం (యుఎన్ ఐఫ్ ఐఎల్)కు సైనిక బలగాలను సమకూర్చే దేశంగా, ప్రస్తుతం అక్కడ చోటుచేసుకుంటున్న పరిణామాల తీరు మాకు అత్యంత కలవరపాటుకు గురిచేస్తోంది, అని జైస్వాల్ పేర్కొన్నారు.

# అన్నా!
# దేవుడే నీ వద్దకు పంపాడు



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఎఎంఎస్) :** కాంగ్రెస్ అసంతృప్త నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు. జీవన్ రెడ్డిని చూడగానే కేసీఆర్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరం వచ్చిందని జీవన్ రెడ్డి చెప్పారు. మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిందని వ్యాఖ్యానించారు. చాలా ఏండ్ల తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మనసులోని మాటను వ్యక్తం చేస్తూనే జీవన్ రెడ్డి తన కళ్ల వెంట నీళ్లు పెట్టుకున్నారు. దీంతో కేసీఆర్ వెంటనే ఆయన్ను అనునయిస్తూ, అప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. ఆలింగనం చేసుకున్నారు. అనంతరం జీవన్ రెడ్డిని శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరిద్దరు కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నతర్వాత కేసీఆర్.. జీవన్ రెడ్డి బృందానికి మధ్యాహ్న భోజన ఆతిథ్యం ఇచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ భేటీలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె. సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్‌ఎంసీలో అవినీతికి సీఎంయే బాధ్యులు

**తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో టెండర్లు కట్టబెడుతున్నడు**

**జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో పనులన్నీ టెండర్ల ద్వారానే ఇవ్వాలి**

**రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరిస్తూ కమీషన్లు వసూలు చేస్తున్నారు**

**వెంటనే బ్లాక్ మెయిల్ దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తాం**

**8.5 లక్షల ఎకరాలు ఎండబెట్టిన కర్కోటక ప్రభుత్వం ఇది**

**కమీషన్ల కోసమే కాళేశ్వరం మరమ్మత్తులు**

**మహిళ బిల్లుకు 2011 జనాభా లెక్కలు ప్రతిపాదిక ఓ దగా**

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని అవినీతికి కేరాఫ్ గా మార్చేశారని జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. టెండర్లు లేకుండానే రూ. కోట్ల విలువైన కాంట్రాక్ట్ లను తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపుగా రూ. 1148 కోట్ల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని దుయ్యబట్టారు.శుక్రవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ, హెచ్ ఎండీఏలో జరుగుతున్న అవినీతికి సీఎం రేవంత్ రెడ్డియే బాధ్యుడన్నారు. రూ.5 లక్షలకు మించి ఉండే ఏ పని అయినా సరే టెండర్లు పిలవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘిస్తూ రూ. కోట్ల పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్ ను ఉల్లంఘించడమేనని చెప్పారు. టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ ఇవ్వవద్దని 2023 లో ఏర్పాటైన కమిటీ కూడా స్పష్టం చేసిందని కవిత గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 480 కోట్ల పనులను ఇదే విధంగా కట్టబెడితే.. రేవంత్ రెడ్డి సర్కార్ దాన్ని కొనసాగిస్తూ రూ.1,148 కోట్ల పనులను తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని చెప్పారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన పనులను వెంటనే రద్దు చేసి టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినేషన్ పద్ధతిలో ఈ ప్రభుత్వం పిలిచిన డిపార్ట్ మెంట్లలో స్కిల్డ్ లేబర్ ఉంటే వారికి కూడా జీతాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. మొక్కల పెంపకాలు, పంపకాలు, కొనుగోళ్లలో కూడా భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కవిత ఔటర్ రింగ్ రోడ్డు కు సంబంధించిన ఓ కంపెనీ పై వేసిన సిట్ ఏమైందని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డును కాంట్రాక్టర్ కు అప్పగించి...అక్కడి మెయింటెనెన్స్ ను ప్రభుత్వం చేస్తుండటం అత్యంత దారుణమని విమర్శించారు.

**ఈడీకి ఫిర్యాదు చేస్తాం :** జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రీ అవినీతికి అడ్డా అన్నట్లు ఈ విభాగాన్ని తయారు చేశారని కవిత మండిపడ్డారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ. 35 వేల కోట్ల విలువైన భూములను అమ్మేసి.. హైదరాబాద్ అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. పైగా తన అవినీతిని మరింత పెంచుకునేందుకు ఈ సీఎం ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేస్తున్నారన్నారు. హైడ్రా పేరుతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులను హడలెత్తించడంతో పాటు స్క్వేర్ ఫీట్ కు రూ. 150 వారి వద్ద వసూలు చేస్తున్నారని కవిత విమర్శించారు. వీటికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వెంటనే ఈ బ్లాక్ మెయిల్ దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

**కమీషన్ల కోసం కాళేశ్వరం మరమ్మత్తులు**

కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మత్తులకు ప్రభుత్వం ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు కవిత చెప్పారు. కమీషన్ల కక్కుర్తి కోసం కాకుండా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని చెప్పేందుకు ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూమిని ఎండబెట్టిన కర్కోటక ప్రభుత్వం ఇది అని విమర్శించారు. కాళేశ్వరం ప్రయోజనాలను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బీజేపీది మోసపూరిత వైఖరి :** మహిళ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. బిల్లు అమలుకు 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకోవటం అన్యాయమన్నారు. 2027 జన గణనలో బీసీ గణన కూడా చేపట్టనున్న నేపథ్యంలో అప్పటి వరకు వేచి ఉండాలన్నారు. ఇప్పటికే లోక్ సభ ఎన్నికలు సహా, 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు అన్యాయం జరిగిందని చెప్పారు. 2027 జన గణన తర్వాతనే మహిళ బిల్లు అమలు చేయాలని...అదే విధంగా ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీసీ మహిళలంతా కూడా పోరాటానికి సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. మహిళ రిజర్వేషన్ డ్రాఫ్ట్ బిల్లును కూడా తాము పరిశీలిస్తామని చెప్పారు. అవసరమైతే ఢిల్లీకి కూడా వెళ్తామన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎవరో మద్దతిస్తే బతుకుతానని మాట్లాడటమంటే అది పురుషాహంకారమేనని మండిపడ్డారు. తాను తెలంగాణ ఉద్యమంలో రాటుదేలి ప్రజల మధ్యలో పనిచేశానని చెప్పారు. ఇప్పుడు కూడా ప్రజల కోసం పనిచేసేందుకు వచ్చానని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలు స్వయంప్రతిపత్తితో సొంతంగా ఆలోచించే సత్తా ఉన్నవాళ్లని అన్నారు.

**సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు**

ఈ నెల 25 న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. ఒక్కో కమిటీలో 30 మంది సభ్యులుంటారన్నారు. అదే విధంగా 500 మంది వాలంటీర్లు ఉంటారన్నారు. ట్రాఫిక్ సమస్యలు, సభ ఏర్పాట్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వారంతా కో ఆర్డినేట్ చేసుకుంటారన్నారు. సభ ఏర్పాట్ల వివరాల కోసం కమిటీ మెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# డ్రగ్స్ నిందితులకు మరి రెండు రోజుల కస్టడీ

మొదటి పేజీ తరువాయి

ఈ కేసు సంబంధించి మరింత విచారణ అవసరమని పోలీసులు అభిప్రాయపడ్డారు. దీంతో మరో ఐదు రోజుల పోలీసు కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ కోర్టు రెండు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఇప్పటికే మూడోసారి కస్టడీ విచారణ జరిగినప్పటికీ.. డ్రగ్స్ సోర్స్, ఫైర్ ఆర్మ్స్ వినియోగం, దుబాయి కనెక్షన్లు, బ్యాంకు లావాదేవీలు వంటి అంశాలపై మరిన్ని వివరాలు తెలుసుకోవాల్సి ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కాగా మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో గత నెల 14న ఈగల్ టీమ్ దాడి చేసి డ్రగ్స్ పార్టీ గుట్టును రట్టు చేసింది. ఈ సందర్భంగా కొకైన్, లిక్కర్ బాటిళ్లు, ఫైర్ ఆర్మ్స్ స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసు దర్యాప్తు కోసం 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. నిందితులు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# జస్టిస్ వర్మ రాజీనామా

మొదటి పేజీ తరువాయి

ఇందులో రాజ్యాంగ చట్టం, పారిశ్రామిక వివాదాలు, కార్పొరేట్ సమస్యలు, పన్నుల సంబంధిత అంశాలు, పర్యావరణ సమస్యలు, ఇతర అనుబంధ న్యాయశాఖలకు సంబంధించిన విస్తృత శ్రేణి విషయాలను ఆయన నిర్వహించారు. 2006 నుండి న్యాయమూర్తిగా పదోన్నతి పొందే వరకు, ఆయన అలహాబాద్ హైకోర్టుకు ప్రత్యేక న్యాయవాదిగా సేవలందించారు. 2012లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాన స్థాయి న్యాయవాదిగా (చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్) నియమితులైన ఆయన, ఆగస్టు 2013 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత న్యాయస్థానం ఆయనను సీనియర్ న్యాయవాదిగా గుర్తించింది. జస్టిస్ వర్మ అక్టోబర్ 13, 2014న అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు, ఫిబ్రవరి 1, 2016న శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన అక్టోబర్ 11, 2021న ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యారు, ఆ తర్వాత తిరిగి అలహాబాద్ హైకోర్టుకు వచ్చారు. అక్కడ ఆయన ఏప్రిల్ 5, 2025న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన జనవరి 5, 2031న పదవీ విరమణ చేయాల్సి ఉంది.

# ప్రతిపక్షాలది బురద రాజకీయం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి) :** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీ, నాయకులకు అంటించాలని చూస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎవరు ఎన్ని కారు కూతలు కూసిన భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ప్రజలు దీవించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో రూ. 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను మంత్రి ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. రూ. 58.58 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

# పకడ్బందీగా పథకాల అమలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. అలాగే స్పెషాలిటీ క్యాంపులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి.. జిల్లాలో విద్యా రుణాలు 25శాతం ఉండటంతో అర్హులైన ప్రతి విద్యార్థికి మరిన్ని రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు ముందుండాలని మంత్రి ఆదేశించారు. దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో హైదరాబాద్ క్యాపిటల్ సిటీ ముందుందని కేంద్ర మంత్రి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పది కాలాలపాటు కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని చెప్పారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి రంగాలతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్, వాయు కాలుష్యం, నీటితో పాటు ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. జిల్లాలో చేపట్టే పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలు సరైన రీతిలో అందిస్తే కేంద్ర నిధులు మంజూరు చేయించుకునే బాధ్యత తనదని కిషర్ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాలో పేదలు మధ్యతరగతి కుటుంబాలు వలస కూలీలకు జీవన ఉపాధి అవకాశాలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు నేరుగా అందేలా కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వస్తువులపై సభ్యులు లేవని తినే అంశాలపై అధికారులు సత్వరమే స్పందించి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేస్తున్న కృషిని మౌలిక వసతుల సమావేశంలో విద్యాశాఖ అధికారులు ప్రస్తావించి అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన నియోజకవర్గం లో 5720 మంది పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల మొత్తాన్ని చెల్లించారని అలాగే స్కావెంజర్ల జీతాలకై రూ. 10 కోట్లు నిధులు అందించారని విద్యాశాఖ అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.


నగరంలోని ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం పై మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రధానంగా అంబర్పేట్ ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్ పనులు నత్తనడకన సాగడంపై మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులను త్వరలో పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు మంత్రికి వివరించారు. ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా సూర్య ఘర్ పథకం అమలు తీరును మంత్రి వివరిస్తూ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా మేళా నిర్వహపై మూడు నెలల క్రితం జరిగిన దిశ సమావేశంలో మంత్రి ఇచ్చిన సూచనల మేరకు నిర్వహించిన ఎడ్యుకేషన్ మేళా అద్భుత ఫలితాలను ఇచ్చిందని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీంతో రుణాల మంజూరు శాతం ఏడు శాతం నుండి 25 శాతానికి పెంచినట్లు అధికారులు మంత్రికి తెలపగా మరింతగా పెరగాలని మంత్రి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ ఈ సమావేశంలో లేవనెత్తిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతామని కేంద్రమంత్రికి హామీ ఇచ్చారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్ సిద్ధం చేసి పలు విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని వివరించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ముందు ఉన్నాయన్న ఆమె జిల్లాలో అండర్ గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు అంశాలు ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు అలాగే ట్రాన్స్ జెండర్లకు ఆర్థిక చేయుతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎండి వాటర్ వర్క్స్ అశోక్ రెడ్డి,అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డిసిపి డాక్టర్ లావణ్య, సిపిఓ డాక్టర్ సురేందర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, సంక్షేమ అధికారులు ఆశన్న కోటజీ, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, పరిశ్రమల శాఖ జీఎం పవన్ కుమార్, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రైల్వేస్, నేషనల్ హైవే, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్ ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



“ శాసన సభ ఎన్నికల పోలింగ్ త్వరలో జరుగనున్న పశ్చిమ బెంగాల్ లో భయానికి, హింసకు, బెదిరింపులకు, ప్రలోభాలకు ఎంతమాత్రం అవకాశం ఉండకూడదు. పోలింగ్ బూత్‌ల స్వాధీనం, ఓటింగ్ సునాయాసంగా జరుగకుండా బూత్‌ల వద్ద జామింగ్ వంటివి చోటు చేసుకోవడానికి వీలు లేదు. ఈ సారి పశ్చిమ బెంగాల్ లో ఎన్నికలు భయరహితంగాను, హింసకు సందు లేకుండానూ బెదిరింపులు, దాడులు వంటివి సంభవించకుండానూ జరిగి తీరాలి. – బుధవారం నాడు న్యూఢిల్లీలో తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులతో పది నిమిషాల పాటు జరిగిన భేటీలో సిఈసీ గ్యానేశ్ కుమార్ కుమార్ ఈ విధంగా అభిప్రాయపడ్డారు. వివాదస్పదామైన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై టిఎంసి సభ్యులు విమర్శించారు. ఈ సారి ఎన్నికలు ఢిల్లీ అదుపు నుంచి రాజకీయ పక్షపాతం నుంచి ద్వంద్వ ప్రమాణాల నుంచి విముక్తం కావాలి అని అన్నారు. దాంతో ఇక్కడి నుంచి బయటకు పొండి అని బిగ్గరగా వారిపై గ్యానేశ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ”

## వేమన పద్యం

తనకులేనినాడు దైవంబు దూరును
తనకు గల్గెనేని దైవమేల
తనకు దైవమునకు తగులాట మెట్టిదో
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ర్యాగింగ్..ఇంకానా!

వరంగల్ లోని కాకతీయ మెడికల్ కాలేజీ ర్యాగింగ్ కేసు జాతీయ వైద్య మండలి ( ఎన్ఎంసి )దృష్టికి వెళ్లడం, తగిన చర్యల కోసం అది డి ఎం ఇ కి లేఖ రాయడం ఆందోళన కలిగించే అంశం. ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే వైద్య విద్యలో ర్యాగింగ్ ఈ స్థాయికి వికృత రూపం దాల్చడంలో మన మనస్తత్వం రుజువు అవుతుంది. దానిని తొలగించడంలో తలితండ్రుల పాత్ర కూడా కీలకమైనది. ర్యాగింగ్ వంటి ఘటనలు శృతి మించడం దేశంలోని విజ్ఞానాన్ని, పరిణతిని బోనులో నిలబెడుతున్నది. వరంగల్ఎం కాకతీయ మెడికల్ కళాశాలలో ఎం బి బి ఎస్ మూడో సంవత్సరం విద్యార్థులు రెండో ఏడాది విద్యార్థులను ర్యాగింగ్ చేయగా పది రోజుల ముందు రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. రాజీ కుదిరిన తర్వాత జూనియర్లు ర్యాగింగ్ దృశ్యాలను వాట్స్ అప్ లో పోస్ట్ చేయడంతో కథ అడ్డం తిరిగింది . కొంతమంది సీనియర్లు జూనియర్లను మోకాళ్లపై కూర్చోబెట్టి అందుకు క్షమాపణలు చెప్పించగా అది కూడా వాట్స్ అప్ కి ఎక్కింది. మూడో సంవత్సరం విద్యార్థులు ఏడుగురిని ఆరు నెలల పాటు ప్రిన్సిపాల్ సస్పెండ్ చేశారని వార్తలు వచ్చాయి. చిన్నతనంలో తూనీగ రెక్కలు విరిచి ఆనందించే మనస్తత్వం గురించి తెలియని వారుండరు. మనలో చాలామంది ఇందుకు పాల్పడి ఉండవచ్చు.కింద పడిపోయినవాడిని చూసి నవ్వే తత్త్వమూ అప్పటిదే. కిందివారిని అక్కున చేర్చుకోవడానికి బదులు అసహ్యించుకునే అవలక్షణమూ చిన్నప్పటినుంచే వుంది. మనను భల్లూకంలా పట్టుకుని ఉన్న మన అసమ సంస్కృతిలో అంతర్లీనంగా స్థిరపడిపోయిన జాడ్యాలివి. భయం భయంగా కళాశాలల్లో అడుగుపెట్టే ఫ్రెషర్స్ అని పిలిచే కొత్త విద్యార్థులను మరింతగా భయోత్పాతానికి గురి చేసే ర్యాగింగ్ ఈ నేపథ్యం నుంచే రూపు దాల్చిందని అనిపిస్తే తప్పు పట్టలేము.ర్యాగింగ్ పుట్టు పూర్వం లోకి వెళ్లి చూస్తే అది భారతీయ సమాజ వారసత్వం కాదని బోధపడుతుంది.క్రీస్తు పూర్వం 7,8 శతాబ్దాల్లో గ్రీసులో కొత్తగా ఆటల్లో చేరేవారికి మనోబలం కలిగించడానికి ర్యాగింగ్ చేసేవారట.మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత సైనిక కళాశాలల్లోనూ దీనిని పాటించేవారట. అయితే ఇదంతా కొత్తవారిని చేరువ చేసుకోడానికే గాని భయపెట్టి శత్రువులను చేసుకోవడానికి కాదు. కాని ర్యాగింగ్ పేరుతో ఇప్పుడు జరుగుతున్నది మాత్రం యిదే.2024 ఫిబ్రరి లో కేరళ వేనాడ్ లోని ఒక పశువైద్య కళాశాలలో సీనియర్లు ర్యాగింగ్ పేరుతో 29 గంటల పాటు భౌతికంగా మానసికంగా తీవ్ర వేధింపులకు పాల్పడిన తర్వాత ఇరవై సంవత్సరాల వయసులోని జూనియర్ విద్యార్థి హాస్టల్ బాత్రూంలో శవమై కనిపించాడు.దేశంలో 2022-2024 మధ్య 51 ర్యాగింగ్ తరహా మరణాలు సంభవించయని సమాచారం. ఇటువంటి ఘటనలలో మన విద్యార్థుల్లో పేరుకుపోయిన ఆధిపత్య వర్గ మనస్తత్వం అసలు నేరస్థురాలు. దీనిని నిర్మూలించాలి. చట్టబద్ధం కాని ఇటువంటి పద్ధతులను శాశ్వతంగా అంతమొందించాలి.

## రచనలు పంపండి




వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# చదువే జ్ఞానం, చదువే బతుకు

చదువులేకపోతే జ్ఞానం రాదు.జ్ఞానం లేకపోతే నైతిక విలువలుండవు.నైతిక విలువలు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు. ప్రగతి లేక పోతే సంపద ఉండదు. సమాజంలోని అట్టడుగు వర్గాలకి చదువొక్కటే ఉంటే ఇవన్నీ లభిస్తాయి. నిజమైన విద్య సాధికారితనిస్తుంది .తప్పుని తప్పనీ ఒప్పుని ఒప్పనీ చెప్పగల ధైర్యాన్నిస్తుంది. సామాజిక తత్వ వేత్త సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆధునిక భారతీయ బహుజన సంఘ సంస్కర్త 'నవయుగ వైతాళికుడు. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన' మాలి' కులంలో మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 1827 ఏప్రిల్ 11 వ తేదీన జన్మించాడు. భారతదేశంలో కులాలు లేకుండా అవిద్య(నిరక్షరాస్యత) నుండి బయటపడాలని అందుకొరకు ఆధునిక విద్య ఆయుధం వంటిది అని పూలే భావించాడు.



### సామాజిక సమత
### మూఢ విశ్వాసాల నిర్మూలన పూలే

మూఢనమ్మకాలు తొలగించాలని ఏ కులం గొప్పది కాదు. ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సామానమే అని సామాజిక సమత తమ అభిమతం గా భావించిన పూలే బ్రాహ్మణులను కలుపుకొని అనేక సంఘసంస్కరణ చేపట్టాడు.

### మహిళా విద్య మహిళా సాధికారత పూలే

సమాజంలో సగ భాగం వున్న స్త్రీలు అభివృద్ధి చెందక పోతే సమాజ అభివృధి సాధ్యం కాదని భావించిన పూలే పూణే లో1848 ఆగస్టులో బాలికల కొరకు పాటశాల స్థాపించాడు. పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించాడు.అంటరానివారికి( శూద్రులకు) బోధించడానికి ఎవరు ముందుకు రాలేదు. జ్యోతిరావు పూలే సావిత్రీబాయి పూలే వారికి బోధించారు. 1848లో పూణేలో మొట్ట మొదటి దళిత పాటశాల స్థాపించాడు.1851లో మరో 2 పాఠశాలలు '1855 లో రాత్రి బడి స్థాపించి కార్మికులకు విద్యను అందించాడు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త జ్యోతిరావు పూలే .

### వితంతువివాహాలను ప్రోత్సహించాడు

పూలే మహిళావిద్యను ప్రోత్సహించారు. వితంతువుల కష్టాలను చూసి చలించి పోయాడు.వితంతు వివాహాలను బాల్య వివాహాలనుఎ ప్రోత్సహించారు. బాల్య వివాహాల వల్ల15, 20యేళ్ల లోపే వితంతువులై దుర్భర జీవితాలను గడుపుతున్న వితంతువులను మానవతా దృక్పథంతో చేరదీసి వారి పెళ్లిల్లు చేసి వారి పిల్లలను పోషించాలని వారికోసం స్కూల్లుహాస్టల్లు ప్రారంభించారు.1873 75లో బ్రాహ్మణ పురోహితులు లేకుండా "జున్నార్"పరిసర ప్రాంతాల్లో సుమారు40 గ్రామాల్లో పెళ్ళిలు నిర్వహించి ప్రత్యామ్నాయ వివాహ వ్యవస్థను పూలే ప్రోత్సాహించాడు.

### వితంతు వివాహాలు చైతన్యం

వితంతు పునర్వివాహం గురించిప్రజల్లో చైతన్యం తెచ్చాడు.స్వయంగా వితంతువులకు వివాహం జరిపించాడు. 1864 లో "బాల హత్య ప్రతిబంధక్ గృహ " స్థాపించి వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు.1873లో "సత్య శోదక్" సమాజాన్ని నెలకొల్పి శూద్రులను బ్రాహ్మణుల చెర నుండి కాపాడటానికి ఈ సంస్థను స్థాపించి దేశంలో మొట్టమొదటి సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. విగ్రహారాధన ఖండించాడు. స్త్రీ 'పురుషుల మధ్య లింగ వివక్షతను పూలే నిరసించాడు . సమానత్వం' స్వేచ్ఛ' ఐక్యమైత్యంతో కూడిన నవ సమాజాన్ని కాంక్షించాడు.

### అట్టడుగు వర్గాల చైతన్యం కోసం విద్య ఆయుధం పూలే

నిమ్న వర్గాల బాల బాలికలకు విధ్య అందిస్తే రాబోయే తరం సామాజికంగా ఎదుగుతుందని భావించాడు. అట్టడుగు వర్గాల ప్రజల చైతన్యం కోసం విద్యే ఆయుధం అని ప్రబోధించిన నవ భారత నిర్మాత జ్యోతిరావు పూలే అని సామాజిక వేత్తలు పేర్కోవడంగమనార్హం. పూలే కృషిని చూసిన డాక్టర్ అంబేద్కర్ తండ్రి రాంజీ ఎంతగానో ప్రభావిత మయ్యాడు.తన పిల్లలను బాగా చదివించాలని భావించాడు. ఆనాటి సమాజంలో బాల్య వివాహాలుజరిగేవి.సావిత్రిబాయి పూలేతో జ్యోతిబాపూలే పెళ్లి జరిగినపుడు వారిద్దరూ మైనార్టీ తీరని వారే. సావిత్రిబాయినీ విధ్యా వంతురాలుని చేసి టీచర్గ తీర్చిదిద్ది పాఠశాలలను నడిపించాడు. సావిత్రీ బాయి స్త్రీ విద్యకు తొలి మహిళా టీచర్ గా చరిత్రలో నిలిచారు .సమాజ సేవా సంస్కారాన్ని అలవర్చుకొని సావిత్రిబాయి పూలే ప్లేగు వ్యాధి బాధితులకు సేవలు చేస్తూ సావిత్రీ బాయి పూలే 1897లో చనిపోయారు .మరణించే వరకు సేవలను కొనసాగించి ఆదర్శ ఇల్లాలుగా ఉపాధ్యాయులుగా ప్రసిద్ధి చెందారు .సంఘ సేవకురాలుగా దేశానికి తొలి మహిళా ఉపాద్యాయురాలిగా ప్రసిద్ధి చెందారు. సమాజం కోసం సంఘ సంస్కరణల కోసం విశేష కృషి చేసిన జ్యోతిరావు పూలే దేశంలో అనేక మంది సంఘ సంస్కర్తలను ఆకర్షించాడు.పూలే మహారాష్ట్ర 'గుజరాత్ 'బెంగాల్' పంజాబ్ 'ఉత్తర ప్రదేశ్ 'మధ్యప్రదేశ్ లోఅనేక పాటశాలలు నెలకొల్పారు. నేడు మనం చూస్తున్న సమాన హక్కులతో కూడిన ఆదునిక విద్య 'ఆధునిక సైన్సు ' అభివృద్ధి చేందడానికి పూలే చూపిన మార్గం గొప్పదని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేర్కోవడం గమనార్హం. పూలే చేపట్టిన సామాజిక సంస్కరణ ఉద్యమము గిట్టని అగ్రవర్ణాల వారు హత్య చేయడానికి వస్తే వారిని తన సంస్కరణల ఉద్యమంలో భాగస్వాములను చేసి తమ అనుచరులుగా మార్చుకున్న గొప్ప మానవతావాది. అజాత శత్రువు పూలే బ్రహ్మనేతరులను టీచర్లుగా నియమించాలని హంటర్ కమిషన్ కుచేసిన విజ్ఞప్తిని నాటి బ్రిటిష్ పాలకులు అమలుచేశారు. జ్యోతిరావు పూలే 1873లో సత్యశోధక్ సమాజ్ ను స్థాపించి 'దేశభంధు' వారపత్రికలో రైతులు కార్మికుల హక్కులు సమస్యలు సంక్షేమం పట్ల పురోహితులు చేసే దోపిడీ మీద ప్రచారం చేశాడు .కార్మికుల పని గంటలు తగ్గించడం కోసం పోరాటాలు చేశాడు. 16 గంటల పనిగంటలకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. రోజుకు 12గంటల పని విధానాన్ని సాధించాడు. కార్మికుల హక్కుల భద్రత కొరకు పోరాటం చేశాడు.

★పెత్తందార్లు దోపిడీ వ్యతిరేకం పూలే"★ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయదారుల మీద వడ్డీ వ్యాపారుల పెత్తందార్ల దౌర్జన్యం అణిచివేతకు వ్యతిరేకంగా పూలే కృషి చేశాడు. శ్రమ దోపిడీని వ్యతిరేకించాడు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

### స్త్రీ 'పురుష లింగ సమానత పూలే

స్త్రీ 'పురుషులతో పాటు సమాన విధ్య వేతనాలు ఉపాధి అవకాశాలు పొందాలని స్త్రీ పురుష 'వివక్షతకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే పోరాడారు. కుటుంబ వ్యవస్థ రక్షణమీద సమాజ మనుగడ ఆధారపడి వుందని సంసార రథానికి స్త్రీ పురుషులు రథ చక్రాల వంటి వారని జ్యోతిరావు పూలే తన రచనలో తమ ఉపన్యాసాలలో ప్రముఖంగా ప్రస్తావించాడు. మహిళా సాధికారత సాధనకు మహిళా విద్య మహిళాభివృదికి పూలే చేసిన కృషి ప్రశంసనీయం.

### కులనిర్మూలన నవ సమాజం

"గులాంగిరీ ""సేద్యం గానిఛర్మ కోల" గ్రంధాలు రచించి దుర్మార్గమైన కుల వ్యవస్థ సమూలంగా నిర్మూలన కావాలని మనుషులు' బ్రహ్మ ణులు చుట్టిన దాస్యపు సంకెళ్ళ నుండి విముక్తి కావాలని జ్యోతిరావు పూలే పిలుపు నిచ్చాడు.మహారాష్ట్ర లోని పూణే పట్టణములో గోవిందరావు 'చీమన్ బాయి పూలే దంపతులకు ,1827 ఏప్రిల్ 11 వ తేదీ జన్మించి వెనకబడిన వర్గాల విముక్తి కోసం శ్రమించి సమాజ సేవలో తరించిన పూలే దీర్ఘకాలిక జబ్బుతో1890 నవంబర్28న తేదీన మరణించాడు.




నేదునూరి కనకయ్య
9440245771

# విమర్శించే కన్ను కంటే.. అర్థం చేసుకునే మనసు మిన్న

మనం నివసిస్తున్న ఈ ఆధునిక కాలంలో ఒక వింతైన, విస్మయకరమైన సామాజిక వికృతి వేళ్లూనుకుంది. రాజ్యాంగం ఇచ్చిన న్యాయస్థానాలు ఉన్నాయి, నల్ల కోటు ధరించిన న్యాయమూర్తులు ఉన్నారు, గ్రంథాల నిండా చట్టాలు ఉన్నాయి. కానీ, వీటన్నింటికీ సమాంతరంగా ప్రతి గల్లీలోనూ, ప్రతి ఇంట్లోనూ, స్మార్ట్‌ఫోన్ పట్టుకున్న ప్రతి చేతిలోనూ ఒక అప్రకటిత న్యాయమూర్తి తయారయ్యాడు. ఈ వీధి న్యాయస్థానాల కు సాక్ష్యాధారాలు అక్కర్లేదు, వాదోపవాదాలతో పనిలేదు. ఒక చూపు, ఒక మాట, ఒక ముద్ర శిక్ష ఖరారైపోతుంది. నేటి సమాజం ఒక అర్థం లేని తీర్పుల బజారుగా మారిపోయింది. ఈ వ్యాసం ద్వారా మన ముఖాన్ని మనమే ఒకసారి సామాజిక దర్పణంలో చూసుకుందాం.మానవ పరిణామ క్రమంలో మెదడు విశ్లేషణ చేయడం నేర్చుకుంది. ఎదురుగా ఉన్నది మిత్రుడా లేక శత్రువా? ప్రమాదమా లేక రక్షణ? అని అంచనా వేయడం మనిషి మనుగడకు అవసరమైంది. మనస్తత్వ శాస్త్రవేత్తల ప్రకారం, ఇతరులను వర్గీకరించడం మెదడు చేసే ఒక రక్షణ ప్రక్రియ. అయితే, ఈ విశ్లేషణ మనల్ని మనం మెరుగుపరుచుకోవడానికి, ఎదుటివారి పట్ల అప్రమత్తంగా ఉండటానికి పరిమితమైతే అది వివేకం. కానీ, ఆ అంచనా పరిధి దాటి అవతలి వ్యక్తి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, వారి వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా మారినప్పుడు అది సంస్కార లోపంగా పరిణమిస్తుంది.మన తెలుగు నేల మీద ఈ జడ్జిమెంట్ సంస్కృతి వేళ్ళూనుకుపోయింది. ఉదాహరణకు, ఒక యువతి ఉద్యోగరీత్యా రాత్రి పది గంటలకు ఇంటికి చేరితే, చుట్టుపక్కల వారి చూపుల్లోని వెటకారం, గుసగుసల్లోని విషం ఆమె క్యారెక్టర్‌ను తుత్తునియలు చేస్తాయి. ఒక యువకుడు స్థిరమైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తన కలను నిజం చేసుకోవడానికి స్టార్టప్ పెడితే, వీడికి బుద్ధి లేదు, ఉన్నది వదులుకుని కొరివితో తల గోక్కుంటున్నాడు అని తీర్పు ఇచ్చేస్తారు. ఆ నిర్ణయాల వెనుక ఉన్న కష్టం, ఆ కలల వెనుక ఉన్న నిద్రలేని రాత్రులు ఎవరికీ అక్కర్లేదు. కేవలం ఫలితం మీదనో, లేదా తమ పాత కాలపు ఆలోచనలకు భిన్నంగా ఉండటం మీదనో ఆధారపడి ముద్రలు వేయడం ఎంతవరకు సమంజసం?ఒకప్పుడు రచ్చబండల దగ్గర, టీ కొట్టుల వద్ద జరిగే విమర్శలు ఇప్పుడు డిజిటల్ తెరల మీద వీరవిహారం చేస్తున్నాయి. సోషల్ మీడియా అనేది ఒక బహిరంగ న్యాయస్థానంగా మారిపోయింది. అక్కడ ప్రతి ఒక్కరూ ప్రాసిక్యూటర్లే, ప్రతి ఒక్కరూ జడ్జీలే. ఒక ఫోటో కింద వచ్చే కామెంట్లు చూస్తుంటే మన సమాజం ఎంతటి అసహనపు వైపు వెళ్తుందో అర్థమవుతుంది. నీకు వయసు పెరిగింది, ఇలాంటి బట్టలు వేయొచ్చా?, చూడు ఎంత లావయ్యావో?,పిల్లలు ఉన్నారా? ఇలా ఉంటారా? అసలు ఎదుటి వ్యక్తి జీవితంలో ఏమి జరుగుతుందో తెలియని వారు ఇచ్చే ఈ ఉచిత సలహాలు, విమర్శలు మానసిక బాణాలు. ముఖ్యంగా సెలబ్రిటీల విషయంలో ఈ ధోరణి మరీ వికృతంగా ఉంటుంది. వారు ఒక పొరపాటు చేస్తే చాలు, వారి గతాన్ని, వారి కుటుంబాన్ని లాగి మరీ ట్రోలింగ్ చేస్తారు. సదరు వ్యక్తి పశ్చాత్తాపం వ్యక్తం చేసినా, క్షమాపణ కోరినా ఈ డిజిటల్ మూకలు శాంతించవు. ఎందుకంటే, అక్కడ సానుభూతి కంటే ట్రెండింగ్ ముఖ్యం. ఎదుటి వ్యక్తి మానసిక క్షోభ పడుతుంటే, ఇక్కడ కొందరికి అది ఒక వినోదం. ఈ కన్సెల్ కల్చర్ (Cancel Culture) మనిషిలోని దయను చంపేస్తోంది. మన సమాజం ఇచ్చే తీర్పులు ఎప్పుడూ నిష్పక్షపాతంగా ఉండవు. ఇక్కడ వ్యక్తుల సామాజిక, ఆర్థిక హోదాని బట్టి తీర్పు మారుతూ ఉంటుంది. ఒక బడా పారిశ్రామికవేత్త కొడుకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికితే, పాపం కుర్రాడు, ఒత్తిడిలో ఉన్నట్టున్నాడు అని సానుభూతి చూపే గొంతులు, అదే పని ఒక పేద డ్రైవర్ చేస్తే వీళ్లే సమాజాన్ని పాడు చేస్తున్నారు, కఠినంగా శిక్షించాలి అని గర్జిస్తాయి.లింగ వివక్ష విషయంలోనైతే ఈ తీర్పులు మరీ దారుణం. ఒక పురుషుడు విడాకులు తీసుకుంటే అతని కెరీర్ ముఖ్యం, సర్దుకోలేకపోయాడు అని అంటారు. అదే ఒక స్త్రీ విడాకులు తీసుకుంటే, ఆమె పద్ధతి బాలేదని, సంప్రదాయాలు తెలియవని ముద్ర వేస్తారు. అంటే, ఇక్కడ తప్పు ముఖ్యం కాదు, ఆ తప్పు చేసింది ఎవరు అనే దాని మీద శిక్ష ఆధారపడి ఉంటుంది. ఇది కేవలం విమర్శ కాదు, బలహీనుల మీద బలవంతులు చూపే అణచివేత. అధికారం ఉన్నవాడికి నీతులు చెప్పే ధైర్యం సమాజానికి లేదు, అందుకే బలహీనుడిని బలిపశువును చేస్తోంది.ఈ నిరంతర విమర్శలు, తీర్పులు వ్యక్తులపై ఎటువంటి ప్రభావం చూపుతాయో మనం ఎప్పుడైనా ఆలోచించామా? నేటి తరం యువతలో పెరుగుతున్న ఆందోళన (Anxiety), కుంగుబాటు (Depression) వెనుక ఈ సామాజిక ఒత్తిడి ప్రధాన పాత్ర పోషిస్తోంది. నేను ఏం చేసినా లోకం ఏదో ఒకటి అంటుంది అనే భయం సృజనాత్మకతను చంపేస్తోంది.ఎంతో మంది అద్భుతమైన కళాకారులు తమ ప్రతిభను బయటపెట్టకుండా లోపలే దాచుకుంటున్నారు. కారణం సమాజం ఏమనుకుంటుంది? అనే భయం. ఎంతో మంది వ్యవస్థాపకులు తమ కొత్త ఆలోచనలను కార్యరూపంలో పెట్టలేక పోతున్నారు. విఫలమైతే వచ్చే హేళనను భరించలేమని వారు వెనకడుగు వేస్తున్నారు. అంతకంటే దారుణం ఏమిటంటే, అనేక ఆత్మహత్యల మూలాలు ఈ సామాజిక వెలివేతలోనే ఉన్నాయి. మనిషి తాను చేసిన తప్పు కంటే, ఆ తప్పును లోకం ఎత్తిచూపే తీరుకే ఎక్కువ కృంగిపోతున్నాడు. బ్రతికే హక్కు కోల్పోయాను అనే భావన కలిగించడంలో మన తీర్పులే ప్రధాన కారకాలు. ఈ స్థితి నుండి మనం బయటపడలేమా? ఖచ్చితంగా పడవచ్చు. కానీ అది చట్టాల ద్వారా సాధ్యం కాదు, మన వ్యక్తిగత ఆలోచనా విధానంలో మార్పు రావాలి.ప్రతి విషయం మీద మన అభిప్రాయం చెప్పాల్సిన అవసరం లేదు. ఎదుటి వ్యక్తి జీవితం మనకు అర్థం కానప్పుడు, మౌనంగా ఉండటం అత్యున్నత సంస్కారం. అడగని సలహా, అనవసర విమర్శ అహంకారానికి గుర్తులు.ఎదుటి వ్యక్తి స్థానంలో నిలబడి ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. ఒకరు ఒక నిర్ణయం తీసుకున్నారంటే దాని వెనుక మనకు తెలియని ఎన్నో బాధలు, పోరాటాలు ఉండవచ్చు. ఆ కథ తెలియకుండా క్లైమాక్స్ మీద తీర్పు చెప్పడం మూర్ఖత్వం. మన పిల్లలకు ర్యాంకులు, మార్కులు నేర్పడం కంటే మనుషులను గౌరవించడం నేర్పాలి. అతడు వేరుగా ఉన్నాడు అని వెక్కిరించడం కాకుండా, వేరుగా ఉండటం ఒక ప్రత్యేకత అని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. వైవిధ్యాన్ని గౌరవించే సమాజమే నిజమైన ఆరోగ్యకరమైన సమాజం.సోషల్ మీడియాలో ఏదైనా టైప్ చేసే ముందు ఒక్క క్షణం ఆగండి. నేను రాసే ఈ మాట ఎదుటి వ్యక్తిని ఎంత దెబ్బతీస్తుంది? అని ఆలోచించండి. విమర్శ నిర్మాణాత్మకంగా ఉండాలి కానీ విధ్వంసకరంగా కాదు.చివరగా ఒక్క మాట ఇతరుల మీద తీర్పులు చెప్పే ముందు, ఒకసారి అద్దం ముందు నిలబడి మనల్ని మనం చూసుకుందాం. మనలో తప్పులు లేవా? మన జీవితంలో చీకటి కోణాలు లేవా? మనం ఎప్పుడూ పొరపాట్లు చేయలేదా? అందరం మనుషులమే, అందరికీ లోపాలు ఉంటాయి. విమర్శించే కళ కంటే అర్థం చేసుకునే కళ గొప్పది అనేది సార్వజనీన సత్యం. తీర్పు చెప్పే అధికారం ఆ భగవంతుడికో లేక ప్రకృతికో వదిలేద్దాం. మనం చేయగలిగిందల్లా ఎదుటి వ్యక్తికి చేయూతనివ్వడం. పొరపాటు చేస్తే సరిదిద్దుకునే అవకాశం ఇవ్వడం. ఒక సమాజం ఎప్పుడు నాగరికత చెందుతుందంటే అక్కడ బలహీనులకు భద్రత ఉన్నప్పుడు, భిన్నత్వం కలిగిన వారికి గౌరవం దక్కినప్పుడు, వైఫల్యం చెందిన వారికి మళ్ళీ నిలబడే వెసులుబాటు ఉన్నప్పుడు.మనం తీర్పు చెప్పే సమాజం (Judging Society) నుండి అర్థం చేసుకునే సమాజం (Understanding Society) వైపు ప్రయాణించాలి. ఆ మార్పు రేపు ఎప్పుడో రాదు.మీ పక్క వ్యక్తి గురించి మీరు ఇప్పుడు మాట్లాడే మాటతోనే మొదలవ్వాలి. కరుణ లేని విజ్ఞానం కంటే, ప్రేమతో కూడిన మౌనం మిన్న. లోకాన్ని మార్చడం కంటే, మన మాటను మారుద్దాం. అదే అసలైన మానవత్వం.

ఒకపురుషుడు విడాకులు తీసుకుంటే అతని కెరీర్ ముఖ్యం, సర్దుకోలేకపోయాడు అని అంటారు. అదే ఒక స్త్రీ విడాకులు తీసుకుంటే, ఆమె పద్ధతి బాలేదని, సంప్రదాయాలు తెలియవని ముద్ర వేస్తారు. అంటే, ఇక్కడ తప్పు ముఖ్యం కాదు, ఆ తప్పు చేసింది ఎవరు అనే దాని మీద శిక్ష ఆధారపడి ఉంటుంది. ఇది కేవలం విమర్శ కాదు, బలహీనుల మీద బలవంతులు చూపే అణచివేత. అధికారం ఉన్నవాడికి నీతులు చెప్పే ధైర్యం సమాజానికి లేదు, అందుకే బలహీనుడిని బలిపశువును చేస్తోంది.ఈ నిరంతర విమ ర్శలు, తీర్పులు వ్యక్తులపై ఎటు వంటి ప్రభావం చూపుతాయో మనం ఎప్పు డైనా ఆలోచించామా? నేటి తరం యువతలో పెరుగుతున్న ఆందోళన (Anxiety), కుంగుబాటు (Depression) వెనుక ఈ సామాజిక ఒత్తిడి ప్రధాన పాత్ర పోషిస్తోంది. నేను ఏం చేసినా లోకం ఏదో ఒకటి అంటుంది అనే భయం సృజనాత్మకతను చంపేస్తోంది.






డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మళ్ళీ తెరమీదకి వచ్చింది .దేశవ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేకెత్తిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఈ నెలలోనే పార్లమెంటు ముందుకు రానుందని తెలుస్తోంది . ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం . 2026 తర్వాతే నియోజకవర్గాల పెంపు ఉంటుందని గతంలో రాజ్యాంగ సవరణ చేయగా, ఇప్పుడు ఆ గడువు సమీపించడంతో కేంద్రం ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని భావిస్తోంది .ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అంచనాల ప్రకారం ఈ సంఖ్య 750 నుండి 848 వరకు చేరవచ్చని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. దీనివల్ల దేశ రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకునే అవకాశముంది .నియోజకవర్గాల పెంపునకు ప్రాతిపదికగా యాభై శాతం పెంపును తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను కాపాడాల్సిన అవసరం కూడా ఈ ప్రక్రియలో కీలకంగా మారింది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన తమిళనాడు, కేరళ, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ వంటి దక్షిణ రాష్ట్రాలు తమ సీట్ల సంఖ్య తగ్గుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు జనాభా భారీగా పెరిగిన ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది . మరో ముఖ్య అంశం మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించినది. మహిళా రిజర్వేషన్ అమలు కావాలంటే నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో పట్టుదలగా ముందుకు సాగుతోంది. కొత్త పార్లమెంటు భవనంలో ఇప్పటికే పెరగబోయే సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు సిద్ధం చేయడం కూడా ఈ బిల్లు రాబోతోందన్న సంకేతాలను బలపరుస్తోంది. రాజకీయంగా ఇది ఒక కీలకమైన పరిణామంగా భావిస్తున్నారు. ప్రాంతీయ పార్టీల ప్రభావం, కేంద్రంలో అధికార సమీకరణాలు ఈ సీట్ల పెంపుతో పూర్తిగా మారే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఈ అంశంపై స్పందిస్తూ, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెలలో జరగబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత కీలకమైనవిగా నిలవనున్నాయి . ఈ బిల్లు పై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి .




ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఈ అంశంపై స్పందిస్తూ, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెలలో జరగబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత కీలకమైనవిగా నిలవనున్నాయి . ఈ బిల్లు పై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి

జక్కు విజయ్ కుమార్
ఫ్రీ లాన్సర్ సీనియర్ జర్నలిస్ట్

# జాతీయం-అంతర్జాతీయం

### బీజేపీ బెంగాల్ మేనిఫెస్టో విడుదల

## యుసిసి, భద్రత, ఉపాధికి ప్రాధాన్యత



**కోల్‌కత, ఏప్రిల్ 10 (వుదయం) :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ శుక్రవారం సంకల్ప పత్రం పేరుతో తన మేనిఫెస్టోను విడుదల చేసింది. ఒకవేళ తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఆరు నెలల్లోగా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకువస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది.

కోల్‌కతాలో మేనిఫెస్టోను ఆవిష్కరిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ప్రకటన చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) పౌరులందరికీ ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలను ప్రతిపాదిస్తుంది. ఇది వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతలను కూడా పరిగణలోకి తీసుకుంటుంది. మత ఆధారిత చట్టాల స్థానంలో ఉమ్మడి చట్టాన్ని అమలు చేయడమే దీని లక్ష్యం.

**ప్రచారంలో కేంద్ర బిందువుగా యుసిసి**

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, బీజేపీ ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో యుసిసిని అమలు చేసిందని షా పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు అనేకంటిలో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అమలు చేస్తున్నారన్నారు. ఆరు నెలల్లోపు మేము బెంగాల్‌లో యుసిసిని అమలు చేస్తాం. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌరులందరికీ ఒకే విధమైన, ఏకీకృత, ఉమ్మడి చట్టాలు వర్తించేలా చూస్తాం," అని ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఎఎన్ ఐ వార్తా సంస్థ తెలిపింది.

ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. రాష్ట్రంలో ఓటింగ్‌పై ఈ అంశం ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

**సరిహద్దులు, భద్రతపై దృష్టి**

సరిహద్దు నియంత్రణ, అక్రమ కార్యకలాపాల గురించి కూడా షా ప్రస్తావించారు. తాము చొరబాటుదారుల నుంచి బెంగాల్ సరిహద్దులను మూసివేయడమే కాకుండా, బెంగాల్ గుండా భారతదేశం నుంచి ఒక్క ఆవు కూడా అక్రమ రవాణా కాకుండా చూస్తాం," అని షా అన్నారు.

ఈ మేనిఫెస్టో అభివృద్ధికి ఒక ప్రణాళికను అందిస్తుందని ఆయన అన్నారు. ఈ మేనిఫెస్టో బెంగాల్‌లోని ప్రతి వర్గాన్ని నిరాశ నుంచి బయటకు తీసుకువచ్చే మార్గమని ఆయన అన్నారు. రకరకాల భయాలు చుట్టుముట్టిన రైతులకు ఇది ఒక కొత్త మార్గాన్ని చూపిస్తుంది. ప్రధానమంత్రి మోడీ ఊహించిన అభివృద్ధి చెందిన భారతదేశానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ని కూడా ఈ మేనిఫెస్టో బెంగాల్ ప్రజల ముందు ఉంచుతుంది, అని ఆయన అన్నారు.


**హింస, పాలన వాగ్దానాలపై చర్చా వేదిక**

రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రజలు భయంతో, నిరాశతో ఉన్నారు. ప్రజలు మనస్ఫూర్తిగా మార్పును ఆశిస్తున్నారు. నేడు మేం బెంగాల్ శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరిస్తున్నాం, అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ హింసపై విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిషన్ విచారణ జరుపుతుందని ఆయన తెలిపారు. ఏ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారనే దానితో సంబంధం లేకుండా, రాజకీయ హింసకు సంబంధించిన అన్ని ఘటనలపై విచారణ జరిపి, ప్రతి కేసును తార్కిక ముగింపునకు తీసుకువచ్చేలా చూసేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో తాము ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, అవినీతి, రాజకీయ హింస, శాంతిభద్రతల పునరుద్ధరణ వంటి అంశాలను పరిష్కరించడానికి మూడు శ్వేతపత్రాలను ప్రవేశపెడతామని షా అన్నారు. సోనార్ బంగ్లా దార్శనికతపై ఆధారపడిన ఈ ఎన్నికల ప్రణాళికలో పాలన, యువత ఉపాధి, మహిళల భద్రత, జాతీయ భద్రతకు సంబంధించిన హామీలు పొందుపరిచారు. 294 మంది సభ్యులు కలిగిన శాసనసభకు పోలింగ్ ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో జరగనుంది. ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది.

## మధురలో పడవ బోల్తా

### 25 మంది గల్లంతు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (వుదయం):**

ఉత్తరప్రదేశ్ లోని మధురలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. యమునా నదిలో శృంగార్ ఘాట్ దగ్గర స్టీమర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 25 మంది గల్లంతయ్యారు. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. 15 మందిని సహాయక బృందాలు రక్షించినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో పడవలో 33 మందికి పైగా ఉన్నట్టు సమాచారం.

అధికారుల ప్రకారం, సుమారు 30 మందిని తీసుకువెళ్తున్న రెండు పడవల్లో ఒకటి నదిలో అకస్మాత్తుగా మునిగిపోవడంతో, కేసీ ఘాట్ సమీపంలో ఈ ప్రమాదం సంభవించింది.

ఈ రోజు మధ్యాహ్నం సుమారు 2:45 గంటల సమయంలో, ఇక్కడి యమునా నదిలో ఒక అత్యంత దురదృష్టకరమైన ప్రమాదం సంభవించింది. లూథియానాకు చెందిన సుమారు 30 మంది వ్యక్తులు ఇక్కడికి వచ్చి, రెండు పడవల్లో నదిలో విహరిస్తున్నారు. కేసీ ఘాట్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది, అక్కడ ఆ రెండు పడవల్లో ఒకటి మునిగిపోయింది," అని మధుర జిల్లా మేజిస్ట్రేట్ సి.పి. సింగ్ ఐఎఎన్ ఎస్ వార్తా సంస్థకు తెలిపారు. "ఇప్పటివరకు ఆరు మృతదేహాలను వెలికితీశారని, సుమారు 16 నుండి 17 మందిని కాపాడరని" అని సింగ్ వివరించారు. స్థానిక అధికారులు, అత్యవసర సేవల సిబ్బందితో కూడిన సహాయక బృందాలు, గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి.

మధుర జిల్లాలో పడవ బోల్తా పడిన ఘోర ఘటనలో ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరం, హృదయ విదారకం అని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు.

"మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. సంబంధిత అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టాలని, గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని ఆదేశించాను," అని సీఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరణించిన వారి ఆత్మలకు శాశ్వత శాంతిని, శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబాలకు ఈ తీవ్ర దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని, గాయపడిన వారికి త్వరితగతిన కోలుకునే శక్తిని ప్రసాదించాలని నేను శ్రీరామచంద్రుని ప్రార్థిస్తున్నాను," అని ఆయన పేర్కొన్నారు.

అంతకుముందు రోజు, మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో మరొక పడవ ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని, అక్కడ నర్మదా నదిలో ఒక పడవ బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. ఓంకారేశ్వర జ్యోతిర్లింగం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ మనోజ్ కుమార్ రాయ్ తెలిపారు. అయితే, అందులో ఉన్న 10 మంది భక్తులను సురక్షితంగా కాపాడారు.

### అమెరికా-ఇరాన్ చర్చలకు సన్నద్ధమవుతున్న పాక్

## ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రత



**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :**

రెండు వారాల సున్నితమైన కాల్పుల విరమణ ప్రకటన అనంతరం అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలకు పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతోంది. పశ్చిమ ఆసియాలోని సంఘర్షణపై అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ, ఇస్లామాబాద్ వీధులు కఠినమైన లాక్‌డౌన్‌లో ఉన్నాయి. తెహ్రాన్, వాషింగ్టన్‌ల మధ్య కీలక మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని చెప్పడంతో, ఇస్లామాబాద్ వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, ఈ వాదనను అమెరికా, ఇజ్రాయెల్ రెండూ తోసిపుచ్చాయి.

అనిశ్చితి ఉన్నప్పటికీ, చర్చల నిమిత్తం తమ దేశానికి ప్రయాణించే ప్రతినిధులు, పాత్రికేయుల కోసం పాకిస్తాన్ వీసా ఆన్ అరైవల్ సదుపాయాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని పాకిస్తాన్ డిప్యూటీ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ శుక్రవారం తన సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు.

చర్చల నేపథ్యంలో రెడ్ అలర్ట్ లో కొనసాగుతున్న రాజధాని ఇస్లామాబాద్ అంతటా భారీ భద్రతా బలగాలను మోహరించారు. పర్యటించే ప్రతినిధులకు బహుళస్థాయి భద్రత కల్పించేందుకు 10,000 మందికి పైగా పోలీసులు, భద్రతా సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. సైన్యం సహకారంతో పోలీసులు, పారామిలిటరీ రేంజర్స్ బలగాలను మోహరించారు. కీలకమైన ప్రభుత్వ భవనాలు ఉన్న రెడ్ జోన్‌కు సైన్యం, రేంజర్లు కాపలా కాస్తున్నారు. అధీకృత అధికారులు, నివాసితులకు మాత్రమే ప్రవేశం పరిమితం చేసిన ఈ ప్రాంతంలోకి మార్గలా రోడ్డు ద్వారా మాత్రమే ప్రవేశం ఉంటుంది.

ఈ చర్చలపై ప్రపంచ నిశిత దృష్టి ఉంటుంది. వీటి ఫలితం పశ్చిమ ఆసియా భద్రత, ప్రపంచ ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ దౌత్యంపై సుదూర ప్రభావాలను చూపే అవకాశం ఉంది. అయితే, శుక్రవారం నాటికి అమెరికా, ఇరాన్‌ల ప్రతినిధుల రాకపై ఎటువంటి అధికారిక సమాచారం లేకపోవడంతో చర్చలపై సందేహాలు వ్యక్తం అవుతూ, భవిష్యత్తు క్రమంగా అనిశ్చితంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.

అమెరికా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించడానికి యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్‌కు బయలుదేరుతున్న తరుణంలో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదికపై, కాల్పుల విరమణ ప్రభావశీలతపై సందేహాలు వ్యక్తం చేశారు హోర్ముజ్ జలసంధి గుండా చమురును వెళ్లనివ్వడంలో ఇరాన్ చాలా పేలవమైన, కొందరు చెప్పినట్లుగా అవమానకరమైన పని చేస్తోంది అని ఆయన అభిప్రాయపడ్డారు. తాము అంగీకరించిన ఒప్పందం అది కాదని ఆయన పేర్కొన్నారు. ఆ కీలక జలమార్గం గుండా వెళ్లడానికి ఇరాన్ అనుమతించిన నౌకల సంఖ్య గురించి ట్రంప్ రాశారు.

హిజ్బుల్లా ఖండించినప్పటికీ, వచ్చే వారం వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్, లెబనాన్‌లు చర్చలు జరపనున్నాయని ఒక అమెరికా విదేశాంగ శాఖ అధికారి పేర్కొన్నప్పటికీ, ఈ వారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన ఘోరమైన దాడుల వల్ల సున్నితమైన కాల్పుల విరమణకు ముప్పు వాటిల్లడంతో తెహ్రాన్ భాగస్వామ్యంపై అనిశ్చితి నెలకొంది.

విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్‌తో సహా పలువురు సీనియర్ అధికారులు, అమెరికాతో చర్చల నిమిత్తం పాకిస్తాన్‌కు వెళ్లారని అంతర్జాతీయ మీడియాలో వచ్చిన వార్తలను ఇరాన్ అధికారిక వార్తా సంస్థలు ఖండించాయని 'ప్రెస్ టీవీ' శుక్రవారం తెలిపింది.

భద్రతా కారణాలను పేర్కొంటూ, అధికారులు ప్రతినిధుల రాకకు సంబంధించిన సమయాలను వెల్లడించలేదు. ఎవరు పాల్గొంటారనే విషయం కచ్చితంగా తెలియకపోవడంతో, చర్చల రోజు సమీపిస్తున్న కొద్దీ అనిశ్చితి మరింత పెరుగుతోంది.

ఇజ్రాయెల్‌పై పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు చర్చలను మరింత ఉద్రిక్తం చేశాయి. టెల్ అవీవ్ నుండి తీవ్ర ఖండనను ఎదుర్కొన్న ఈ వ్యాఖ్యలు, మధ్యవర్తిగా ఇస్లామాబాద్ పోషిస్తున్న పాత్రపై ఆందోళనలను రేకెత్తించాయి.

ఎక్స్ లో ఇప్పుడు తొలగించిన ఒక పోస్ట్ లో, ఇజ్రాయెల్‌ను మానవాళికి ఒక శాపంగా అభివర్ణించడమే కాక , యూరోపియన్ యూదులను వదిలించుకోవాలని ప్రజలను కోరాడు, ఇది తమను నాశనం చేయాలని కోరుకునే ఉగ్రవాదుల నుంచి తమను తాము రక్షించుకుంటామని టెల్ అవీవ్ ప్రతిజ్ఞ చేసేందుకు కారణమైంది.

## పామునైనా నమ్మగలం బిజెపిని కాదు

**కోల్‌కత, ఏప్రిల్ 10 (వుదయం) :**



ఈశాన్య రాష్ట్ర నివాసుల నుండి ఓట్లు పొందగలమనే నమ్మకం లేకపోవడం వల్లే, అసోం ఎన్నికల కోసం బీజేపీ బయటి ప్రజలను తీసుకువచ్చిందని మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.

ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఒక ఎన్నికల సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పామునైనా నమ్మవచ్చు కానీ బిజెపిని నమ్మలేం అని ఆమె విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో రెండు దశలలో జరుగనున్న క్రమంలో టిఎంసి, బిజెపి మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న విషయం తెలిసిందే.

రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాల్లోనూ తననే టిఎంసి అభ్యర్థిగా పరిగణించాలని ఓటర్లను కోరుతూ, నా నాయకత్వంలో మీకు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలంటే, అన్ని స్థానాల్లోనూ అభ్యర్థిని నేనే అని ఆమె అన్నారు.

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనలో ఏ ఏజెన్సీ కూడా తటస్తంగా లేదని ఆమె ఆరోపించారు. కాషాయ పార్టీ వారందరినీ కొనుగోలు చేసిందని ఆమె విమర్శించారు. ఉత్తరప్రదేశ్ నుండి అస్సాంకు 50,000 మందితో కూడిన ఒక రైలు తీసుకొచ్చారు, అని ఆమె ఆరోపించారు. 126 మంది సభ్యులు కలిగిన అస్సాం శాసనసభకు ఎన్నికలు గురువారం నాడు ఒకే దశలో నిర్వహించిన విషయం తెలిసిందే.

పశ్చిమ బెంగాల్‌లో కూడా బయటవారిని తీసుకువచ్చి అదే వ్యూహాన్ని అమలు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని టిఎంసి అధిపతి ఆరోపించారు. ఈ కారణంగానే రాష్ట్రంలో పలువురు అధికారులను బదిలీ చేశారన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల కాగానే, ఎన్నికల కమిషన్ పలువురు పోలీసు, పరిపాలనాధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. జనాన్ని, డబ్బును, మాదకద్రవ్యాలను తీసుకువస్తున్నారని, కానీ మన కార్యకర్తలు పోరాడుతున్నారని, మనం గెలుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.


రాష్ట్రంలో సర్ ప్రక్రియ సందర్భంగా 90 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని బెనర్జీ తెలిపారు. అందులో 60 లక్షలు హిందువులు కాగా, 30 లక్షలు ముస్లింలవని అన్నారు. అస్సాంలో జరిగిన ఎన్ఆర్‌సి ప్రక్రియలో, జాబితా నుండి తొలగించిన 19 లక్షల పేర్లలో 13 లక్షల మంది హిందువులు, 6 లక్షల మంది ముస్లింలు ఉన్నారని పేర్కొంటూ బిజెపిని విశ్వసించలేమని ఆమె అన్నారు.

ఎంతోమంది షెడ్యూల్డ్ కులాల వారి పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించారని ఆమె ఆరోపించారు. తనకు ఎలాంటి ఆందోళన లేదని, ప్రజల పట్ల తనకు నమ్మకం ఉందని; ఓటర్ల జాబితాలో మిగిలి ఉన్న ఓట్లన్నీ మాకే లభిస్తాయని టిఎంసి అధినేత్రి అన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రజల మాంసాహార ఎంపికలపై బీజేపీ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుందని ఆమె ఆరోపించారు. ఇక్కడి ప్రజలు తమ ఇష్టానుసారం ఆహారం తీసుకుంటారు, కానీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి అలా లేదు, అని ఆమె అన్నారు. బీహార్‌లో చేపలను తినడానికి అనుమతి లేదని, అందుకే వాటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారని ఆమె పేర్కొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ వలస కార్మికులు అకృత్యాలకు గురవుతున్నారని ఆరోపిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇతర రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ ప్రజలకు రక్షణ కల్పించలేకపోతున్నారు, కానీ ఎన్నికల సభల్లో మాత్రం సోనార్ బంగ్లాను వాగ్దానం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ ప్రజలకు భద్రత కల్పించిన తర్వాతే, మీరు సోనార్ బంగ్లా గురించి కలలు కనాలి, అని ఆమె పేర్కొన్నారు.

## లెబనాన్‌తో చర్చలకు ఓకే

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :**



విస్తృత ప్రాంతీయ కాల్పుల విరమణ ఉన్నప్పటికీ ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్నందున, లెబనాన్‌తో వీలైనంత త్వరగా ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని తాను అధికారులను ఆదేశించినట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహూ తెలిపారు. బీరూట్ నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన అన్నారు. ఒక్కరోజులోనే ఇజ్రాయెల్ దాడులలో 200 మంది హతమయ్యి, వెయ్యిమందికి పైగా గాయపడిన నేపథ్యంలో లెబనాన్ గురువారం నాడు ఒక్కరోజు సంతాపదినాన్ని ప్రకటించింది. ఈ దాడులు యుఎస్‌ఇరాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించాయని, అవి చర్చలకు ముప్పు అవుతాయని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ హెచ్చరించారు. లెబనాన్‌ను ఎప్పుడూ ఒంటరిని చేయమని కూడా ఆయన హెచ్చరించారు. నిజమైన ఒప్పందం పూర్తిగా అమలయ్యే వరకూ ఇరాన్ చుట్టుపక్కల అమెరికా దళాలు మోహరించి ఉంటాయని, లేదంటే మరింత ఘర్షణ నెలకొంటుందని యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు.

## పశ్చిమాసియాలో పరిణామాలను గమనిస్తున్నాం

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :**



తాము పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతంలోని దేశాలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి మంత్రులు గల్ఫ్ దేశాలలో పర్యటిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి జయశంకర్ ప్రస్తుతం మారిషస్‌లో పర్యటిస్తున్నారని, అక్కడి నుంచి ఆయన ఏప్రిల్ 11 12వ తేదీలలో యుఎఇకి ప్రయాణించనున్నారని అన్నారు. భారత్ యుఎఇ సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో ఆయన ఆ దేశ నాయకులతో జయశంకర్ చర్చలు జరుపుతారని తెలిపారు.

ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి కృషి చేస్తూనే, పొరుగు దేశాల అభ్యర్థన మేరకు, వారి ఇంధన అవసరాలను తీర్చడానికి మద్దతు కూడా అందిస్తున్నామని వివరించారు. రెండువారాల కిందట మనం 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేశామని తెలిపారు. మారిషస్ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే, చమురు, గ్యాస్ సరఫరాకు సంబంధించిన ప్రభుత్వం నుంచి ప్రభుత్వ ఒప్పందాన్ని ఖరారు చేస్తున్నామన్నారు. పెట్రోలియం మంత్రి ఏప్రిల్ 9, 10వ తేదీలలో ఖతార్ పర్యటనలో ఉన్నారని తెలిపారు. భారత్‌కు ఇంధన సరఫరాదారులలో ఖతార్ కీలకమైందని, విశ్వసనీయమైన ఇంధన సరఫరాదారుగా కొనసాగడానికి ఖతార్ కట్టుబడి ఉందన్నారు. భారతదేశంతో ఇంధన సంబంధాలు, సహకారాన్ని కొనసాగించి, ఇంధన సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఎదురుచూస్తున్నామని ఖతార్ ఇంధన శాఖ మంత్రి పునరుద్ఘాటించారు, అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరించారు.

## ఐఎస్ఐ మద్దతుగల ముఠా అరెస్టు

### నెట్‌వర్క్ ను ఛేదించి, 10 మందిని అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (వుదయం) :**

దేశంలో పని చేస్తున్న సీమాంతర గూఢచార నెట్‌వర్క్ లకు అనూహ్యమైన దెబ్బ జరిగింది. తాజాగా, పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) మద్దతు ఉన్న ఒక గూఢచార ముఠాను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం ఛేదించి, కనీసం 10 మంది ఆపరేటివ్లను అరెస్టు చేసింది. ఈ అత్యంత కీలకమైన ఆపరేషన్‌కు అదనపు పోలీస్ కమిషనర్ (స్పెషల్ సెల్) ప్రమోద్ కుష్వాహా నేతృత్వం వహించారు. జాతీయ భద్రతను అస్థిరపరిచేందుకు విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ఈ ఆపరేటివ్‌లు పని చేస్తున్నారు.

దేశ రాజధానితో పాటు ఇతర ప్రాంతాలలో కూడా ఈ ముఠా పలు కీలక సంస్థలు, రద్దీగా ఉండే ప్రదేశాలలో విస్తృతమైన గూఢచర్యంలో నిమగ్నమై ఉందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా, నిందితులు తమ ఐఎస్ఐ సహచరులకు నిజసమయ సమాచారాన్ని అందించడానికి కీలకమైన ప్రదేశాలలో అధునాతన కెమెరాలను అమర్చుతూ పట్టుబడ్డారని సమాచారం.

భారతదేశంలో భవిష్యత్తులో జరగబోయే ఉగ్రదాడులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి, వాటిని మెరుగుపరచడానికి ఈ నిఘా సమాచారాన్ని సరిహద్దు దాటించి పంపిస్తున్నారు.

వారాల తరబడి సాంకేతిక నిఘా, మానవ గూఢచార సేకరణ తర్వాత స్పెషల్ సెల్ ఈ కఠిన చర్యలు చేపట్టింది. అరెస్టు అయిన 10 మంది అనుమానితులు ఈ నెట్‌వర్క్‌కు స్థానిక వెన్నెముకగా పనిచేస్తూ, లాజిస్టిక్స్‌ను సులభతరం చేయడంతో పాటు నగర మౌలిక సదుపాయాలలోని బలహీనతలను గుర్తిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. అరెస్టుల అనంతరం, పోలీసులు ఎలక్ట్రానిక్ పరికరాలను, నేరాన్ని రుజువు చేయగల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ఇతర స్లీపర్ సెల్స్ను గుర్తించేందుకు ప్రస్తుతం వీటిని విశ్లేషిస్తున్నారు.

### కల్నల్ పురోహిత్‌కు

## ప్రమోషన్

**వుదయం డెస్క్:** లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ పురోహిత్‌కు బ్రిగేడియర్‌గా పదోన్నతి కల్పించేందుకు భారత సైన్యం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో పురోహిత్ కూడా అభియోగాలు ఎదుర్కొన్నారు. అయితే, ముంబయిలోని ప్రత్యేక కోర్టు గతేడాది ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. పదోన్నతి, పదవీకాల ప్రయోజనాలను కోరుతూ కర్నల్ సాయుధ దళాల ట్రిబ్యునల్ పిటిషన్ దాఖలు చేశారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ సుదీర్ఘకాలం సాగడం వల్ల తన వృత్తిపరమైన పురోగతిపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31న జరగాల్సిన కర్నల్ పదవీవిరమణపై ఏఎఫ్‌టీ స్టే విధించింది.

## పాక్‌కు బయలుదేరిన యుఎస్ ఉపాధ్యక్షుడు వాన్స్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :**



పాకిస్తాన్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాల మధ్య జరగనున్న చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎయిర్ ఫోర్స్ టూ విమానంలో బయలుదేరారు. తాము చర్చల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని విమానం ఎక్కే ముందు ఆయన అన్నారు. ఇరానీయులు సద్భావనతో వ్యవహరిస్తే, అమెరికా వారికి స్నేహ హస్తం అందించడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అయితే, వారు తమని మోసం చేయడానికి ప్రయత్నిస్తే, అమెరికా అందుకు సానుకూలంగా స్పందించదని కూడా ఆయన స్పష్టం చేశారు. చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు మార్గదర్శకాలు ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ చర్చలు పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో శనివారం ప్రారంభమవుతాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ ఇంతకుముందు ప్రకటించారు. వాన్స్‌తో పాటు ప్రత్యేక దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొంటారు. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాక కోసం ఇస్లామాబాద్ ఇంకా వేచి చూస్తోందని పాకిస్తాన్‌లోని మీడియా పేర్కొంటోంది.

## రష్యాలో చిక్కుకున్న 26 మంది భారతీయులు

### సుప్రీంలో పిటిషన్

**వుదయం డెస్క్:** రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారిని మభ్యపెట్టి రష్యాకు పంపించిన కొందరు ఏజెంట్లు.. తప్పుదోవ పట్టించారనే ఆరోపణలున్నాయి. ఆ తర్వాత పుతిన్ సైన్యంతో కలిసి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనేలా వారిపై ఒత్తిడి తెచ్చారని సమాచారం.

26 మంది ఆచూకీ తెలుసుకోవడానికి దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. మాస్కో నిర్బంధంలో ఉన్న వారి ప్రస్తుత పరిస్థితి ఏంటనే విషయాన్ని తెలియజేయాలని అందులో పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌తో రష్యా చేస్తోన్న యుద్ధంలో వీరు పాల్గొనాల్సి వచ్చిందని.. కొందరు గాయపడ్డట్లు, మరికొందరు నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రాన్ని వివరణ కోరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించి, కేంద్రం నుంచి సూచనలు తీసుకుంటానని ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల చివరలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం యోగ ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్ నినాదంతో కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని తెలిపారు. యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వం పెరుగుతాయని అన్ని అన్నారు ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉదయం పాఠాలు ప్రారంభానికి ముందు యోగా నిర్వహణను చేపట్టాలని అన్నారు . ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీఆర్‌డీఓ దత్తారావు, వైద్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## – జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్,వుదయం:** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా యువత మరియు చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో ఈత అభ్యాసం అందించేందుకు స్విమ్మింగ్ పూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుభ్రత, ఫిల్టరేషన్ వ్యవస్థ, చేంజింగ్ రూములు, షవర్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పూల్‌లోని నీటిని నిరంతరం శుద్ధి చేయడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. స్విమ్మింగ్‌కు వచ్చే క్రీడాకారులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక సమయాలను కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, లైఫ్ గార్డులు ఎల్లప్పుడూ విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ప్రజలు స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించే అవకాశమున్నందున శుభ్రత, భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా స్విమ్మింగ్ పూల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.



**రాజన్న సిరిసిల్ల, వుదయం:** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే సమయం కావడంతో జిల్లా కలెక్టర్ ముందుగా మెనూ చార్ట్ పరిశీలించారు. నేరుగా డైనింగ్ రూమ్ వద్దకు చేరుకొని.. ప్లేట్ తీసుకుని విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారా అని ఆరా తీశారు. వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. చదవడం, రాయడం, ప్రణాళిక సిద్ధం చేసుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనలు చేశారు. మంచిగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మొక్కజొన్న రైతులకు సర్కార్ బాసట

**కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**
**నియోజకవర్గంలో 25 శాతం పెరిగిన సాగు**
**క్వింటాలుకు రూ. 2400 చెల్లింపు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి,( వుదయం ప్రతినిధి ):** రబీ సీజన్‌లో మొక్కజొన్న పండించిన రైతులను ఆదుకు నేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంద ని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.భారీగా పెరిగిన దిగుబడిఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడా దితో పోలిస్తే ధర్మపురి నియోజకవర్గంలో ఈసారి మొక్కజొన్న సాగు 25 శాతం పెరిగిందని వెల్లడించారు. ధర్మపురి, వెల్గటూ ర్,బుగ్గారం,గొల్లపల్లి, పెగడపల్లి, ఎండపల్లి మండలాల పరిధిలో మొత్తం 4,898 ఎకరాల్లో పంట సాగైందని, సుమారు 1.46 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేసినట్లు తెలిపారు.బయట మార్కెట్‌లో దళారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని క్వింటాలుకు కేవలం రూ. 1600 మాత్రమే చెల్లిస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలను గాలికొదిలేశారని మంత్రి విమర్శించారు. ధాన్యం కొనుగోలులో క్వింటాలుకు 4 కిలోల చొప్పున తరుగు పేరుతో కోత విధించి రైతులను నష్టపరిచారని



ధ్వజమెత్తారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఎలాంటి కోతలు లేకుండా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తూ అండ గా నిలుస్తోందని స్పష్టం చేశారు. ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగ నభట్ల దినేష్,మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్, ఎఎంసి వైస్ చైర్మన్ నరసింహులు,స్థానిక ప్రజాప్రతినిధు లు,డైరెక్టర్లు మున్సిపల్ కౌన్సిలర్లు మార్కెట్ సెక్రెటరీ శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రోడ్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,ఏప్రిల్ 10(వుదయం ప్రతినిధి)** పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని*జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష* అన్నారు. శుక్రవారం *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఇంజనీరింగ్ చీఫ్ మోహన్ నాయక్*తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ,జిల్లాలోని మంథని, గోలివాడ గోదావరిఖని పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని, పుష్కరాల సమయంలో గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల మంది భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట్, కళ్యాణ కట్ట, పిండె ప్రధానం చేసే స్థలం ఏర్పాటు పనులు రోజుకు లక్ష మంది భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారేజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథనిగౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని , ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ & ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మంథని పట్టణంలోని అన్ని దేవాలయాలకు అంతర్గత రోడ్లు నిర్మించాలని, పుష్కర ఘాటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఇఇ బావ్ సింగ్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# యోగా మన సంస్కృతిలో అంతర్భాగం

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా ప్రణాళిక - ప్రగతి పాలన 99 రోజుల కార్యాచరణ" లో భాగంగా, హోమియోపతి & ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా యోగ కేంద్రంలో యోగా తరగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షత వహించగా, ఆర్డీవో ఎన్ వి గిరి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా స్థాయి అధికారులు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రగతి పాలన అనేది కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధి మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్యాభివృద్ధి కూడా. ఆయుష్ వైద్యం, యోగా మన సంస్కృతిలో అంతర్భాగం. వీటిని ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత ఆరోగ్య శాఖపై ఉంది" అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఆయుష్ వైద్య విధానాల్లో హోమియోపతి, ఆయుర్వేదం, యునాని వైద్యాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా జీవనశైలి వ్యాధులు నివారణలో యోగా, ప్రాణాయామం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అనంతరం ఆయుష్ విభాగం యోగా ఇన్‌స్ట్రక్టర్ ఆధ్వర్యంలో 45 నిమిషాలపాటు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో సూక్ష్మ వ్యాయామాలు, తాడాసనం, వృక్షాసనం, భుజంగాసనం వంటి యోగా ఆసనాలు, అనులోమ విలోమ, భ్రామరీ ప్రాణాయామాలు, ధ్యానం చేయించబడింది. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా చేయాలని, తమ పరిధిలో ప్రజలకు యోగా ప్రాముఖ్యతను తెలియజేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది సిబ్బంది పాల్గొన్నారు.




# రైతుల అభివృద్దే రాష్ట్ర అభివృద్ధి : మంత్రి అడ్లూరి



**కోరుట్ల (వుదయం ప్రతినిధి)** కోరుట్ల మెట్ పెల్లి మార్కెట్ కమిటీ సెంటర్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లతో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని రైతులు తమ పంటను సంబంధిత కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర వద్ద అమ్ముకోవాలని కోరారు రైతులు పండించిన మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం తగిన మద్దతు ధర 2400 రూపాయలు కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని మధ్యవర్తులు లేకుండా నేరుగా తమ పంటను విక్రయించాలని సూచించారు ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు రైతుల సంక్షేమం మా ప్రాధాన్యత అని తెలిపారు అనంతరం కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యమని రైతుల సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రైతులకు లాభదాయకమైన విధానాలను అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడం తో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకున్నామని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు తూకం నిల్వ చెల్లింపుల ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు రైతులు తమ పంటను శుభ్రంగా తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రైతుల పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం అనునిత్యం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు మంత్రి అడ్లూరి వెంట మార్క్‌ఫెడ్ అధికారులు కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి కోరుట్ల తహసిల్దార్ కృష్ణ చైతన్య మెట్ పల్లి తహసీల్దార్ స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు రైతులు తదితరులు ప్రజలు పాల్గొన్నారు

# మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా




**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు ముమ్మ రం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వాహనాల నంబర్ ప్లేట్లు,మైనర్ డ్రైవింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై ప్రధానంగా దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎస్సై కఠినంగా వ్యవహరించారు. ప్రధానంగా మైనర్లు వాహనాలు నడపడంపై ఆయన ఆగ్ర హం వ్యక్తం చేశారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఖాళీగా ఉండి రోడ్లపైకి వాహనాలతో వస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకర మని హెచ్చ రించారు.ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడు తూ తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రాణాపాయం సంభవిం చే అవకాశం ఉందని,అటు పిల్లల భవిష్యత్తు,ఇటు ఇతరుల ప్రాణా లు గాల్లో దీపాల్లా మారుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిఘా పెంచామని, మద్యం సేవించి వాహనం నడపడం ఆత్మహత్యాసదృశ్యమేనని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహిం చిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి జరిమా నాలు విధించారు.11మంది మైనర్లు,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 03 పై కేసులు నమోదు చేశారు.ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసులకు సహకరిం చాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలి

**నిజామాబాద్, వుదయం,ఏప్రిల్ 10:** వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు విస్తృత స్థాయిలో సమాచారం చేరడంలో సామాజిక మాధ్యమాలు ఎంతో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు కూడా సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల సేవలను వినియోగించుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా గణనీయమైన సంఖ్యలో ఫాలోవర్లు కలిగి ఉన్న సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు ఎంతో ఉత్సాహంతో తరలివచ్చి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగస్వాములై వాటి విజయవంతానికి



తోడ్పాటును అందించాలని కోరారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఉద్దేశించిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని తమదైన శైలిలో ప్రజలకు చేరవేయాలని, తద్వారా ప్రమాదాల నియంత్రణకు దోహదపడిన వారు అవుతారని అన్నారు. 16న జరిగే మండల స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సభలలో పాల్గొని ప్రజలను చైతన్యపర్చాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములయ్యే సామాజిక మాధ్యమకర్తలకు జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా తగిన గుర్తింపును అందిస్తామని అన్నారు. కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీఈఓ అశోక్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి




**కాగజ్ నగర్ (వుదయం ప్రతినిధి )** స్థానిక ఆదిత్య నర్సింగ్ హోమ్, కాగజ్‌నగర్లో టిఎస్‌యూటిఎఫ్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి మాట్లాడుతూ మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ ల జయంతుల సందర్భంగా ఈ నెల 12వ తేదీన ఉదయం 9 గంటల నుండి ఆదిత్య నర్సింగ్ హోమ్, కాగజ్‌నగర్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానం సమానమని, రక్తదానం వల్ల ఎలాంటి హానీ ఉండదని, ఆరోగ్యవంతులైన ప్రతి వ్యక్తి నిర్భయంగా రక్తదానం చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. సునీత మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, అవసరమైనప్పుడు ప్రాణాలను రక్షించడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. డాక్టర్ రావుజీ, టిఎస్‌యూటిఎఫ్ నాయకులు రాజకమలాకర్ రెడ్డి,, మహిపాల్, ఫణతి మహేష్, సామాజిక కార్యకర్త ఈర్ల సునీల్ పాల్గొన్నారు.

# కరీంనగర్ లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

## మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి);** తమ పాలకవర్గంలో నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం రోజు నగరంలోని 3 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. విద్యారణ్యపురి రోడ్డు నెంబర్ 1 లో స్థానిక కార్పోరేటర్ సాదినేని లావణ్య మునిందర్, సుడా చైర్మన్ నరెందర్ రెడ్డి తో కలిసి 8.70 లక్షల నిధులతో సీసీ రోడ్డుకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం కు శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ కొలగాని శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. విలీన గ్రామాల, శివారు ప్రాంతాల డివిజన్లను ప్రాధాన్యతగా తీసుకొని నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 3 వ డివిజన్ విద్యారణ్యపురిలో 8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభం చేశామని తెలిపారు. నగర వ్యాప్తంగా కాలనీల్లో అంతర్గత రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్ది ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చేపట్టిన పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికాకులను ఆదేశించినట్లు తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మా పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ గాజ రమ శివరాం, ఈఈ శివానందం, ఏఈ గఫూర్, కాలని వాసులు కూర రాఘవ రెడ్డి, కళ్యెం మధుసూదన్ రెడ్డి, కోరెపు లక్మయ్య, రాజలింగారి రాం రెడ్డి, ముత్యాల మల్లారెడ్డి, గుర్రం శ్రీధర్ రెడ్డి, ఆమనగంటి క్రిష్ణ చైతన్య, బద్దం రాం రెడ్డి, గుర్రం తిరుపతి రెడ్డి, జడల రఘు నందన్, సూర శ్రీనివాస్, అరికొంతం మనోహర్ రెడ్డి, కోల మల్లా రెడ్డి, బోద శ్రీధర్ రెడ్డి, గట్ల సురేందర్ రెడ్డి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఆకస్మిక తనిఖీలో మెరిసిన ధరూర్ ఎంపీపీఎస్ పాఠశాల

**గద్వాల ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండలంలోని ఎంపీపీఎస్ ధరూర్ పాఠశాలలో శుక్రవారం రోజు ఉదయం జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ఆకస్మికం గా తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు నమోదు పత్రాలను పరిశీలించి విద్యా ప్రమాణాలపై దృష్టి సారించారు అలాగే ప్రస్తుతమున్న ఎస్ ఏ 2 పరీక్షల నిర్వహణ ను సమీక్షించారు 2వ తరగతి 4వ తరగతి విద్యార్థులతో నేటి ఇంగ్లీష్ ప్రశ్నాపత్రాన్ని చదివించి వారి అవగాహనను పరీక్షించారు విద్యార్థులను బ్లాక్‌బోర్డు పై సమాధానాలు వ్రాయించడంతో పాటు ఇంగ్లీష్ పదాలకు తెలుగు అర్థాలు చెప్పించే విధంగా పరీక్షించారు విద్యార్థుల ప్రతిభ ఉపాధ్యా యుల బోధనా విధానంపై డిఈఓ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం పాఠశాల నిర్వహణలో ఉన్న క్రమశిక్షణను ఆమె ప్రశంసించారు డిఈఓ సందర్శన సందర్భంగా సిఆర్ పి డి. నరసింహులు కూడా పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం డిఈఓకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆరోగ్యకర జీవనానికి హోమియోపతి మార్గం

### ఆయుష్ సేవల్లో హోమియోపతి కీలక పాత్ర



- వ్యాధి నివారణలో హోమియోపతి ప్రాధాన్యం,
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి:**

ఆరోగ్య నాగర్ కర్నూల్ గా మార్చే లక్ష్యంతో, ఆయుష్ సేవలు, యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోభాగంగా ఆరోగ్య థీమ్ డే 5 సందర్భంగా శుక్రవారం "ప్రపంచ హోమియోపతి దినోత్సవం & ఆయుష్ దినోత్సవం" వేడుకలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ముఖ్యఅతిథిగా హాజరయ్యా డిఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్,తో కలిసి హాజరై కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ,....... యోగ సాధన ద్వారా శారీరక మరియు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం హోమియోపతి, యోగా, ఆయుర్వేద వంటి సంప్రదాయ వైద్య విధానాలను మరింత ప్రోత్సహిస్తూ అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. హోమియోపతి వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఇది సహజసిద్ధమైన మరియు సురక్షితమైన చికిత్సా విధానంగా గుర్తింపు పొందింది. "సిమిలియా సిమిలిబస్ కురెంటూర్" (సదృశం సదృశంతోనే నయం అవుతుంది) అనే సిద్ధాంతంపై ఆధారపడిన హోమియోపతి, శరీరంలోని సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి వ్యాధులను నయం చేయడంలో సహాయపడుతుంది. హోమియోపతి వైద్యం ప్రత్యేకత, ఇది వ్యాధి లక్షణాలను మాత్రమే కాదు, రోగి యొక్క శారీరక, మానసిక స్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని చికిత్స అందిస్తుంది. దీని వల్ల దీర్ఘకాలిక వ్యాధులు, అలర్జీలు, చర్మ సమస్యలు, జీర్ణ సంబంధ సమస్యలు వంటి అనేక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపినారు.ఆరోగ్య సంరక్షణలో హోమియోపతి ప్రాముఖ్యత రోజురోజుకీ పెరుగుతోంది. దుష్ప్రభావాలు తక్కువగా ఉండటం, తక్కువ ఖర్చుతో చికిత్స అందుబాటులో ఉండటం, అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉండటం దీని ప్రధాన ప్రయోజనాలు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఈ సేవలను విస్తరించి ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంపై దృష్టి సారించామని పేర్కొన్నారు.అదేవిధంగా వ్యాధుల నివారణ, ఆరోగ్యకర జీవన శైలి అలవాట్లు, మాతృశిశు సంరక్షణ వంటి కీలక అంశాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వెల్నెస్ సెంటర్లు మరియు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆయుష్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ నాయక్, డిఎంహెచ్ఓ డాక్టర్ రవి నాయక్, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఉషారాణి, వివిధ విభాగాల వైద్యులు, రోగులు తదితరులు పాల్గొన్నారు.



## యోగ మన జీవితంలో ఒక భాగం కావాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకే కాక శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగ దోహదపడుతున్నందున ప్రతి మనిషి జీవితంలో నిత్యం యోగ చేయడాన్ని ఒక భాగంగా చేసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో శుక్రవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హోమియోపతి, ఆయుష్ దినోత్సవ సంబరాల్లో ఉదయం గద్వాల ఐడిఓసి గార్డెన్ లో యోగ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కానుక యోగ అని, అనేక దేశాల ప్రజలు యోగను సాధన చేస్తుండడం మనకెంతో గర్వకారణం అన్నారు. యోగ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ఏటా అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగిస్తోందన్నారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యోగ శిక్షకులు తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ యోగను సాధన చేసేందుకు తమ వంతుగా కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం ఆరేళ్ల చిన్నారి రష్మిక చేసిన సూర్య నమస్కారాలు, యోగసనాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, డిపిఓ శ్రీకాంత్, సర్వే ఏడి నూకరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుషిత, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, యోగ శిక్షకులు, వైద్యాధికారులు, పలువురు వైద్యులు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

**నారాయణపేట ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి)**



యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజూవారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్య అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) దినోత్సవ యోగ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం గంట పాటు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. సమయం దొరికినప్పుడల్లా తాను యోగా చేస్తానని తెలిపారు. తన సోదరి ద్వారా యోగా నేర్చుకున్నానని ఆయన చెప్పారు. కలెక్టర్, అధికారులు, రాజకీయ ప్రముఖులు, వైద్యులు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, పతంజలి సభ్యులు ఆయుష్ సిబ్బంది, యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ జయచంద్రమోహన్, డిఆర్డిఏ మొగులప్ప, బీజేపీ నేత నాగురావు నామాజీ, యోగా శిక్షకులు సురేష్, మెడికల్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## ఆయుష్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్సాన్‌పల్లిలో 'ఉచిత ఆయుష్ మెగా వైద్య శిబిరం' ప్రారంభం

**సిద్దిపేట, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి)**

### సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపు

సిద్ధిపేట జిల్లా కేంద్ర సమీపంలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ సమీకృత ఆయుష్‌వైద్యశాలలో ఆయుర్వేదిక్, యునాని, హోమియోపతి వైద్య సేవలను జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి కోరారు. శుక్రవారం అక్కడ ఏర్పాటు చేసిన 'ఉచిత ఆయుష్ మెగా వైద్య శిబిరాన్ని' ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని ఓపి వార్డులను, మందుల పంపిణీ కేంద్రాన్ని స్వయంగా తనిఖీ చేశారు. రోగులకు మందులు ఇవ్వడమే కాకుండా, వాటిని వాడే విధానం మరియు ఆహార నియమాలపై వైద్యులు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, ఈ వారాన్ని 'హెల్త్ వీక్'గా నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే ఈ మెగా శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 50 పడకల సామర్థ్యం గల ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల్లో 24 గంటలూ ఓపి సేవలు అందుబాటులో ఉంటాయని, మందులు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. ప్రకృతిలో లభించే మూలికలతో మందులు తయారు చేస్తారు కాబట్టి, ఆయుష్ వైద్యం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. మోకాలి నొప్పులు, జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారు ఆయుష్ వైద్యాన్ని ఆశ్రయించాలని సూచించారు. చికిత్స పొందే సమయంలో పులుపుకు దూరంగా ఉండాలని, రాగిజావ, మొక్కజొన్న/సజ్జ గడక వంటి బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని రోగులకు హితవు పలికారు. భవిష్యత్తులో ఈ కేంద్రంలో అవసరమైన వారికి శస్త్రచికిత్స సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని ఆమె ప్రకటించారు.వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఆయుష్ కేంద్రంలో చికిత్స పొందితే మెరుగైన ఫలితాలు ఉంటాయి. ఈ ఆసుపత్రి సేవలపై జిల్లా నలుమూలల విస్తృత ప్రచారం కల్పించాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్ధిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేర్గు మంజుల రాజ్ నర్సు, ఆయుష్ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమాదేవి, వివిధ విభాగాల వైద్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టల్ సౌకర్యాలు మరియు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సమీక్ష

**వనపర్తి ఏప్రిల్ 10(వుదయం ప్రతి నిధి )**



ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల విద్యార్థుల సంక్షేమ హాస్టల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గదులు, వంటశాల (కిచెన్), స్టాక్ రూమ్‌ను పరిశీలించి హాస్టల్‌లో అందిస్తున్న అన్ని సదుపాయాలను తనిఖీ చేశారు.ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విచారించిన కలెక్టర్, సమస్యలు ఉంటే వెంటనే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని, అవి త్వరితగతిన పరిష్కరించబడతాయని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. మెనూను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హాస్టల్‌కు నాణ్యమైన బియ్యం సరఫరా జరుగుతోందా అని అడగగా, అధికారులు నాణ్యమైన బియ్యం అందుతోందని తెలిపారు.కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి హాస్టల్ సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకోగా, విద్యార్థులు అన్ని సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు.డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో సదుపాయాలు కల్పించాలి కలెక్టర్ రాజపేట గ్రామ శివారులోని డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనిని సందర్శించారు. అక్కడ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రధాన రహదారికి కలిసే కనెక్టివిటీ రోడ్ విషయం సహా, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని స్థానికులు తెలియజేయగా, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్ రెడ్డి ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.







## ప్రభుత్వ హాస్టల్, రేషన్ షాపు ,ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**వికారాబాద్,(వుదయం ప్రతినిధి):**

సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారము జిల్లాలోని మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ ఎస్సి బాలుర వసతి గృహాన్ని సందర్శించి తరగతి తరగతి గదులు, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిగది లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం , సిబ్బంది , వసతి గృహం లో ఉండే మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరము వికారాబాద్ పట్టణం లోని ఇందిరా నగర్ రేషన్ షాప్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ప్రజలకు సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు, బియ్యం, చక్కెర, తదితర వస్తువుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. స్టాక్ రిజిస్టర్, పంపిణీ రికార్డులను పరిశీలించి సరుకులు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని తనిఖీ చేశారు.లబ్ధిదారులకు ఏప్రిల్, మే , జూన్ మూడు నెలలకు సంబంధించి బియ్యాన్ని ఒకేసారి తూకం చేసి ఇచ్చే విధానాన్ని పరిశీలించారు. నాణ్యమైన సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.తదనంతరము జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్స, ఔషధాల లభ్యతపై సమగ్రంగా పరిశీలించారు. వివిధ వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను తనిఖీ చేశారు.రోగులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, డి ఎం సి ఎస్ మురళీకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సుపరింటెన్డేంట్ రాజ్య లక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఒక్క ఫోన్ కాల్

- పరుగులు పెట్టిన యంత్రాంగం
- ఎర్రవల్లి బాస్ పవర్ తగ్గలేదని నిరూపించిన 'కొండపోచమ్మ' సాక్షి
- ఎండిపోతున్న పంటలకు మోక్షం.. నీటి విడుదలపై అధికారుల హుటాహుటి చర్యలు

**సిద్దిపేట,(గజ్వేల్) ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి))**



ఆయన అధికారంలో ఉండకపోవచ్చు.. కానీ ఆయన మాటకు ఉన్న 'పవర్' మాత్రం ఇసుమంతైనా తగ్గలేదని మరోసారి నిరూపితమైంది. బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) చేసిన ఒక్క ఫోన్ కాల్‌తో అధికార యంత్రాంగం పరుగులు తీసింది. ఎండిపోతున్న రైతుల పంట పొలాలకు కొండపోచమ్మ సాగర్ జలాలు పరవళ్లు తొక్కాయి. రైతుల ఆవేదన - రంగంలోకి కేసీఆర్ ములుగు మండలం లోని కొట్యాల, అల్లీనగర్, అడవి మజీద్, క్షీరసాగర్ గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇతర ప్రాంతాలకు నీటిని వదులుతున్నా, తమ కాలువలకు నీరు రాకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో రైతులు డీసీసీబీ మాజీ డైరెక్టర్ అంజిరెడ్డిని ఆశ్రయించగా, ఆయన నేరుగా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిశారు. ఒక్క ఆదేశంతో మారిన సీన్ఎండిపోయిన పంటల ఫోటోలను చూసి చలించి పోయిన కేసీఆర్, తక్షణమే నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. రైతు కంట కన్నీరు రాకూడదు.. పంటలు ఎండిపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? వెంటనే నీటిని విడుదల చేయండి... అంటూ తనదైన శైలిలో ఆదేశించారు. మాజీ సీఎం ఫోన్ చేసిన కొద్దిసేపటికే అధికారులు అప్రమత్తమయ్యారు. కాలువల్లో నీరు ఉరకలెత్తుతుండటంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. తమ పంటలను కాపాడిన కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆయన ఎక్కడున్నా శాసించగలరు. అంటూ ఈ ఘటనపై సోషల్ మీ డి యా లో నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. ఫామ్ హౌస్ నుంచే పాలనను ప్రభా వి తం చేయగల సత్తా కేసీఆర్‌కు ఉందని ఈ ఘటనతో మరోసారి స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నా, కేసీఆర్ తన మార్కు రాజకీయంతో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారని ఈ ఉదంతం నిరూపించింది. కేసీఆర్ క్రేజ్ మరియు ఆయన మాటకున్న విలువ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.



## గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు అవార్డు

**మహబూబ్ నగర్ ,ఏప్రిల్ 10(వుదయం ప్రతినిధి):**

షీ ఫర్ స్టెమ్ తెలంగాణ స్టెల్లార్ స్కాలర్షిప్ టిజిటి డబ్ల్యూఆర్డీసీ అవార్డు ను తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.వాసంతి పిళ్ళై తెలిపారు. కళాశాలలో జరిగిన కల్పన షీ ఫర్ స్టెమ్ కార్యక్రమం విజయవంతంగా సాగిందని ఇందులో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఐదు గోల్డ్ అవార్డ్స్ , ప్రతి ఒక్క విద్యార్థికి పదివేల రూపాయలు క్యాష్ ప్రైస్ ను సాధించారని పేర్కొన్నారు. వీటితో పాటుగా కళాశాలకు రెండు లాప్టాప్స్ కూడా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి. విజయ పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**వుదయం,మెదక్ (ఏప్రిల్ 10)**




క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతమైన జీవనశైలి సాధ్యమవుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. పురాతన కాలం నుంచే యోగాసనాలకు విశేష ప్రాధాన్యం ఉందని, మన నవ శక్తులన్నింటిని ఏకం చేసి ఏకాగ్రతను పెంపొందించేది యోగానేనని ఆమె అన్నారు.శుక్రవారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ కార్యక్రమాల భాగంగా యోగా కార్యక్రమం, ప్రపంచ హోమియోపతి (ఆయుష్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.ప్రసిద్ధ యోగా గురువు ఆకుల రవి పాల్గొన్న అధికారులకు యోగాసనాలు చేయించి మార్గనిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులతో కలిసి యోగాసనాలు చేసి అందరినీ ఉత్తేజపరిచారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగ అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనమని తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి, శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత లభిస్తాయని చెప్పారు. యోగ సాధన ద్వారా జీవనశైలిలో సానుకూల మార్పులు వస్తాయని, అనేక వ్యాధులను నివారించుకోవచ్చని సూచించారు.ప్రత్యేకంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పతంజలి, వశిష్ట యోగా సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం



**"మన పోలీస్ – మన ఊరు" కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు సహకరించాలి**

- **ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మద్యం సేవించి వాహనం నడపడంపై కఠిన హెచ్చరిక**

**సిద్దిపేట/మర్కుక్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**

గ్రామాల్లో శాంతి భద్రతలను బలోపేతం చేయడం మరియు ప్రజల్లో సామాజిక అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా గజ్వేల్ రూరల్ పోలీసులు విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, మర్కుక్ ఎస్ఐ దామోదర్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులతో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, పోలీసు అధికారులు గ్రామస్తులతో కలిసి భోజనం చేస్తూ, వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని సీఐ తెలిపారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రానక్కర్లేకుండా, పోలీసులే బాధితుల వద్దకు వెళ్లి సేవలు అందించే 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్' విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని, వీటిని నియంత్రించేందుకు గ్రామ పాలకవర్గాలు చొరవ చూపాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, హెల్మెట్ తప్పనిసరి అని హెచ్చరించారు.18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. భద్రత కోసం ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎండాకాలం కావడంతో విద్యార్థులు కాలువల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు, పాలకవర్గ సభ్యులు నిఘా ఉంచాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.పోలీస్ మరియు ప్రజల మధ్య దూరాన్ని తగ్గించి, నేరరహిత సమాజాన్ని నిర్మించడమే మా సంకల్పం. డయల్ 100 సేవలను ప్రతి ఒక్కరూ అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# రోడ్డు భద్రతపై 'అరైవ్ – అలైవ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం




**వికారాబాద్, (వుదయం ప్రతినిధి):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు కొనసాగనున్న అరైవ్ - అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమిష్టి కృషి తో పనిచేసి విజయవంతము చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు అరైవ్ - అలైవ్, రోడ్డు సేఫ్టీ కార్యక్రమాల పై జిల్లా ఎస్పీ స్నేహ మేహరా,అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్,ఇ. వెంకటాచారి సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని సూచించారు. 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 15వ తేదీన చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డేగా జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. 16 తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. అలాగే, వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం వంటి వాటి పై అవగాహన కల్పించాలన్నారు.ప్రమాదాల నివారణకు కృషి చేసిన వారిని గుర్తించి సన్మానించాలని సూచించారు. 18వ తేదీన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిని గుర్తిస్తూ, వారికి కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. ఈ నెల 16న మండల స్థాయిలో నిర్వహించే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సభల్లోనూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రధాన కూడళ్ళలో మానవహారాలు జరపాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. జిల్లా ఎస్పి స్నేహ మేహరా మాట్లాడుతూ జిల్లాలో బ్లాక్ స్పార్ట్స్ గుర్తించి, సైన్ బోర్డ్స్, ఏర్పాటు పై పి పి టి ద్వారా వివరించారు. అలైవ్ అరైవ్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికి రోడ్డు సేఫ్టీ పై అవగాహనా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్ పి సి ఇ ఓ శ్రీధర్,డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారి వెంకట్ రెడ్డి,డిపిఓ జయసుధ , జిల్లా విద్యాధికారి రేణుకా దేవి , ఆర్ అండ్ బి అధికారి శ్రీధర్ రెడ్డి, పి ఆర్ ఉమేష్ కుమార్, వైద్యా ధికారి స్వర్ణ కుమారి, ఎన్ ఎచ్ ఐ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ లు, డి ఎస్ పి లు, సి ఐ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యోగా, ఆయుష్ శిబిరాలతో ప్రజా ఆరోగ్యంపై అవగాహన

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: వుదయం**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా శుక్రవారం (10042026) ఉదయం 6:30 గంటల నుండి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగకరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.అనంతరం సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని రిట్రైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో ఆయుష్ ఆరోగ్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ శ్రీ పాండు ప్రారంభించారు. ఈ శిబిరంలో యునాని, హోమియోపతి మరియు ఆయుర్వేద వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అదనంగా రక్తపోటు , రక్తంలో చక్కెర స్థాయిలు (షుగర్) పరీక్షలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీ పాండు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి, ఎంఆర్ఓ జయరాం, రిటైర్డ్ ఎంప్లాయిస్,వైద్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు యునాని, ఆయుర్వేద, హోమియోపతి చికిత్సలు సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యాన్ని కాపాడటానికి దోహదపడతాయని అధికారులు తెలిపారు.



# కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**వట్టిపల్లి, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**

అనారోగ్య కారణాల వల్ల పోతుల బొగుడ గ్రామ సర్పంచ్ ముద్దాపురం రాజు బాబాయ్ బసవరాజ్ నిన్న మృతి చెందారు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనో ధైర్యం చెప్పారు ఆ ధైర్య పడొద్దు అండగా ఉంటాను మీ కుటుంబానికి అని హామీ ఇచ్చారు ఈ సమయంలో నే గుండె నిబ్బరం చేసుకొని ధైర్యంగా ఉండాలి అని అన్నారు మాజీ ఎమ్మెల్యే వెంటా బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కోషిక శేఖర్ కార్యకర్తలు అనిల్ ప్రభు శివకుమార్ శివయ్య విశ్వనాథం నగేష్ వీరన్న నాగరాజ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా కేఎస్ పీపీ 4వ స్నాతకోత్సవం

- **ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ పూర్వ సీఈవో**
- **35 మంది పట్టాల ప్రదానం**
- **నలుగురు ప్రతిభావంతులకు బంగారు పతకాలు బహుకరణ**

**పటాన్చెరు, (వుదయం):**




కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తన నాలుగో స్నాతకోత్సవాన్ని ఏప్రిల్ 10, 2026న హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ఒక లాంఛనప్రాయ విద్యా ఊరేగింపు (అకడమిక్ ప్రొసెషన్)తో ప్రారంభమై, సందర్భానికి తగ్గ గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించింది.ఈ వేడుకలో నీతి ఆయోగ్ పూర్వ ముఖ్య కార్యనిర్వహణాధికారి, భారతదేశపు జీ20 షెర్పా అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన ప్రసంగంలో, ఆయన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, దేశ నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తూ, ప్రజా విధానం, పరిపాలనకు అర్థవంతంగా దోహదపడాలని పట్టభద్రులైన విద్యార్థులను ప్రేరేపించారు. క్షేత్రస్థాయి పరిపాలన ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, భారతదేశ సమాఖ్య నిర్మాణంలో కీలకమైన రాష్ట్రాలు, జిల్లాలతో మమేకమవ్వాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. తయారీ రంగంలో వాటాను పెంచడం, వ్యాపార వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'జన విశ్వాస్' (ప్రజా విశ్వాసం)కు ప్రాధాన్యతనిస్తూ, ఎగుమతులను పెంచడానికి, భారతదేశ ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగు పరచడానికి విశ్వాసాన్ని బలపేతం చేయడం, వ్యాపార పరిస్థితులను మెరుగుపరచడం చాలా కీలకమన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయం పై ఆధారపడి ఉన్నారని పేర్కొంటూ, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక పని తీరును బేరీజు వేసుకోవాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు. బలమైన ఆవిష్కరణ వ్యవస్థ కోసం పిలుపునిస్తూ, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలని, స్టార్టప్ లకు మద్దతు ఇవ్వాలని, రిస్క్ క్యాపిటల్ ను పొందేందుకు వీలు కల్పించాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారతదేశ ఆశయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దార్శనికతను సాధించడంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. భారతదేశ పురోగతిని గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలలో వేగవంతమైన పురోగతిని ఆయన ఉదహరించారు. డిజిటల్ చెల్లింపులలో నాయకత్వం, కోడివ్19 వ్యాక్సినేషన్ల వంటి భారీస్థాయి ప్రజా సేవల పంపిణీని కూడా ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి రంగాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) యొక్క పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వర్తమాన కాలాన్ని 'భారతదేశ దశాబ్దం'గా అభివర్ణిస్తూ, అమితాబ్ కాంత్ దేశానికి ఉన్న జనాభా పరమైన ఆధిక్యతను ఎత్తిచూపుతూ, పట్టభద్రులు ఆశావాదంతో, నూతన ఆవిష్కరణతో, దేశ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.తొలుత, ముఖ్య అతిథి, ఇతర ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేయడంతో ఈ వేడుక లాంఛనంగా ప్రారంభమైంది. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో, పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ అమితాబ్ ను పరిచయం చేశారు.

గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు విద్యార్థి ప్రతినిధి సెహజానా కాంట్రాక్టర్ తో ప్రమాణ స్వీకారం ప్రతిని అందించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది విద్యార్థులకు వారి డిగ్రీలతో పాటు, విద్యా నైపుణ్యాన్ని గుర్తించే మెరిట్ పతకాలను ప్రదానం చేశారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ లో మొదటి ర్యాంకు సాధించిన అభిజీత్ సుధీర్ రౌత్ కు అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన బంగారు పతకం ఇచ్చి సత్కరించారు. ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను సిమ్రాన్ కౌర్ డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జునరావు స్మారక బంగారు పతకాన్ని అభిజీత్ సుధీర్ రౌత్, అమల్ శుక్లాలకు సంయుక్తంగా ప్రదానం చేశారు.రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సంతకం కోసం డిగ్రీ రికార్డులను సమర్పించారు. విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, కేఎస్ పీపీ అధ్యాపకురాలు డాక్టర్ వసుధా కడ్జు వందన సమర్పణ చేశారు. కేఎస్ పీపీ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ కూడా పాల్గొన్నారు.పబ్లిక్ పాలసీ, పరిపాలన రంగంలో తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించనున్న పట్టభద్రుల బృందానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

# మృతి చెందిన రైతు భార్యకు 5 లక్షల ఆర్థిక సహాయం



**నారాయణపేట , ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట జిల్లా విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారుల చేతుల మీదుగా విద్యుత్ షాక్ తో మృతి చెందిన రైతు భార్యకు 5 లక్షల చెక్కును అందజేశారు. దన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన రైతు కావాలి కృష్ణయ్య విద్యుత్ షాక్ తో 2022 సంవత్సరంలో మృతి చెందారు.ఈ విషయాన్ని ఈ ఆర్ సి లో చైర్మన్ దృష్టికి తీసుకోపోవడం జరిగింది . భారతీయ కిసాన్ సంఘం నాయకులు తెలిపిన సందర్భంగా రైతు భార్య వసంత కు 5లక్షల తక్షణ సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఏ ఈ మొగులప్ప,బి కే ఎస్ జిల్లా కార్యదర్శి అనంత రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకట ప్ప ,జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున్ , అవసలోని పల్లి రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

- **ఆలయ నిర్మాణానికి ₹50,000 విరాళం ప్రకటించిన సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి**
- **భక్తిశ్రద్ధలతో హోమం జలాధివాస కార్యక్రమాలు**

**సిద్ధిపేట/వర్గల్, ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి)**



సిద్ధిపేట జిల్లా వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో హనుమాన్ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హోమం, జలాధివాసం మరియు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి సర్పంచ్ దాతృత్వంఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి ఆలయ నిర్మాణానికి మరియు ఉత్సవాల నిర్వహణకు తన వంతుగా ₹50,000 (యాభై వేల రూపాయలు) విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని, దైవ నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత, ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని దేవాలయాలను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యువత సేవా గుణాన్ని, దైవ చింతనను కలిగి ఉండి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆదివారం నిర్వహించనున్న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామస్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హనుమాన్ స్వామి అనుగ్రహంతో మల్లారెడ్డిపల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ విజయలక్ష్మి యాదగిరి, గ్రామ సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలుపురోహితులు రాయవరం రవీంద్ర శర్మ, గురుస్వామి అంజా గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోందని, సర్పంచ్ గారితో పాటు అనేకమంది దాతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. భక్తులందరికీ స్వామివారి కరుణాకటాక్షాలు మెండుగా ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ కమిటీల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



- **సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**వెల్దండ, ఏప్రిల్ 10 (వు దయం):**

ప్రజారోగ్యంపై నిరంతరం డాక్టర్స్ పని చేస్తున్నారని గ్రామ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని వెల్దండ సబ్ సెంటర్ పరిధిలో ఎన్ సి డి (అంటు వ్యాధులు కాని వ్యాధులు)స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డా॥ సింధు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన చికిత్స చేస్తారని, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, పర్యవేక్షకులు మురళీ కృష్ణ, మనోజ్ కుమార్, వార్డు సభ్యులు గుద్దటి కిష్టల్, ముదికొండ కవిత రమేష్,పిల్లి దేవేందర్, ఆరోగ్య కార్యకర్త జహంగీర్ బీ,ఆశా కార్యకర్తలు యాదమ్మ,సుజాత, అనిత,పద్మ పాల్గొన్నారు.



# కొండపాక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ డే

**ఉదయం , కొండపాక ప్రతినిధి ఏప్రిల్ 10:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం రోజు ఆయుర్వేద డాక్టర్ రజిని ఆధ్వర్యంలో కొండపాక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ డే ని పురస్కరించుకొని ఆరోగ్య పరిరక్షణలో భాగంగా యోగా కార్యక్రమాలతో పాటు నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ కోసం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు లో దీర్ఘకాలిక రోగాలైన మధుమేహం, రక్తపోటుతో పాటు మోకాళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు, నరాల బలహీనత, జీర్ణాశయ సమస్యలు, చర్మ సమస్యలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ముందు జాగ్రత్తగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పలు సూచనలు చేస్తూ ప్రతి రోజు యోగా చేయాలనీ, సరైన ఆహారం తీసుకుంటూ, కాలానుగుణంగా జీవిత విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, ఆయుష్ , స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

- **ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ**
- **ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి**
- **వడదెబ్బకు గురైతే తగిన చికిత్స అవసరం**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ,ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి)**



భారత వాతావరణ శాఖ (IMD) హైదరాబాద్ వారి సూచనల ప్రకారం రాబోయే మూడు రోజులలో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉన్నందున, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో నేటి నుండి 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు తగినంతగా ద్రవ పదార్థాలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, దాహం లేకపోయినా తరచుగా నీరు తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు, ఉప్పుచక్కెర ద్రావణం వంటి ద్రవాలు తీసుకోవడం మంచిదన్నారు. ఇంటి వద్ద ఓఆర్ఎస్ తయారీ కోసం ఒక లీటర్ తాగునీటిలో ఆరు టీ స్పూన్ల చక్కెర, అరకప్పు టీ స్పూన్ ఉప్పు కలిపి బాగా కలపాలని తెలిపారు. ప్రయాణాల సమయంలో తప్పనిసరిగా తమ వెంట తాగునీటిని తీసుకెళ్లాలని చెప్పారు. పుచ్చకాయ, ఖర్బూజ, కమలాలు, ద్రాక్ష, అనాసపండు, దోసకాయలలో నీటి శాతం అధికంగా ఉన్నందున ఇలాంటి సీజనల్ పండ్లు, కూరగాయలు తినాలని సూచించారు. టీవీ, రేడియో, పత్రికల ద్వారా ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఇంట్లోనే నీడ పట్టున ఉండాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో వంట చేయడం కూడా తగ్గించాలని సూచించారు. మద్యం, టీ, కాఫీ, సోడా వంటి పానీయాలు మరియు అధిక చక్కెర కలిగిన పానీయాలు తీసుకోకూడదన్నారు. అధిక ప్రోటీన్, ఉప్పు, మసాలా, ఆయిల్ ఉన్న ఆహారాలను తగ్గించి, సాధారణ ఆహారాన్ని తీసుకోవాలన్నారు. హీట్ వేవ్ కారణంగా వికారం, వాంతులు, వేడిగా మరియు పొడిగా ఉన్న చర్మం, శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ (104F) వరకు పెరగడం, తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, మూర్ఛ, కండరాల బలహీనత, గుండె వేగంగా కొట్టుకోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. అలాగే గందరగోళం, ఆందోళన, అసహనం, అసమతుల్యత, ఫిట్స్, కోమా వంటి మానసిక మార్పులు కూడా కలగవచ్చని పేర్కొన్నారు. ఈ లక్షణాలలో ఏవైనా కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. అలాగే ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పని ప్రదేశంలో యజమానులు తమ కార్మికుల కోసం చల్లని తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు కార్మికులను తీసుకుని ఉన్న కార్మికుల పై పని భారాన్ని తగ్గించవచ్చన్నారు. గర్భిణీ కార్మికులు, అనారోగ్యంతో ఉన్న కార్మికులు వేడిలో పనిచేయడం గురించి వైద్యులతో చర్చించాలన్నారు. అస్వస్థతకు గురైన వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి శరీర ఉష్ణోగ్రత పెరగడమే కాక ఆందోళన, కండరాల బలహీనత, వికారం, వాంతులు, హృదయ స్పందన పెరగడం, వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే ఎండలో పనిచేయకూడదన్నారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి, నీటితో శరీరాన్ని తుడవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులకు చికిత్స అందించేందుకు 108 కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరపున సంబంధిత శాఖల అధికారులు వైద్య సేవలు అందిస్తారన్నారు. జిల్లావాసులు ఈ సలహాలు, సూచనలను పాటించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఉన్నత లక్ష్యాలే విజయానికి తొలి అడుగు





- **కలెక్టర్ పి. ప్రావీణ్య**
- **9–12 తరగతులే జీవితానికి కీలకం - నీట్ , జె ఇ ఇ , ఎంసెట్ కు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి .**

**సంగారెడ్డి, ఏప్రిల్ 10,వు దయం:**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. శుక్రవారం పటాన్ చెర్వు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఇంటర్ తర్వాత ఉండే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితంలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నీట్ , జెఇ ఇ అడ్వాన్స్డ్ , ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందిస్తున్నదని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని, కష్టపడే వారికి విజయమే ప్రతిఫలమని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని ఆమె వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసినచపాతీ మేకింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్శనలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను ఫౌండేషన్ ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు .

# చక్కని ఆరోగ్యం

## కొర్రలు వర్సెస్ గోధుమ రవ్వ.. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది బెటర్..!

కొర్రలు అధిక ఫైబర్, కాల్షియం, ఐరన్ కలిగి బరువు తగ్గింపు, మధుమేహ నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తాయి. గోధుమ రవ్వతో పోలిస్తే, కొర్రలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి.



శక్తినిచ్చి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడే కొర్రలు సంపూర్ణ ఆరోగ్యానికి ఉత్తమమైన ఎంపిక. కొర్రలు ఫైబర్ ఎక్కువగా ఉండి ఎక్కువసేపు ఆకలి రాకుండా చేస్తాయి. కొర్రలు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ః కాంప్లెక్స్ వంటి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఎముకలు, రక్తం, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

కొర్రలలో అధిక మొత్తంలో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాల బలాన్ని పెంచుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. గోధుమ రవ్వ శరీరానికి శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. డైట్ లక్ష్యాన్ని బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. శ్రమ ఎక్కువగా చేసే వారికి గోధుమ రవ్వ సరిపోతుంది. బరువు తగ్గే డైట్‌లో కొర్రలు ఐదు రెట్లు ఎక్కువగా పనిచేస్తాయి. బరువు తగ్గాలంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న కొర్రలు ఎక్కువగా ఉపయోగపడతాయి. కొర్రలు కడుపుకు తేలికగా జీర్ణమవుతాయి. కొర్రలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. ఎందుకంటే, ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి., అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయి. రక్తంలో షుగర్ లెవెల్స్ స్థిరంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తూ అలసట తగ్గుతుంది. కొన్ని రోజుల్లోనే గోధుమ రవ్వ రుచికి అలవాటు పడిపోతారు. కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గోధుమ రవ్వలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు ఎక్కువ సేపు నిండిన భావన కలుగుతుంది.కొర్రలలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది, ఇది రక్తహీనత (అనీమియా) నివారణకు సహాయపడుతుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. కొర్రలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మరియు అమినో ఆమ్లాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి వృద్ధాప్య లక్షణాలను తగ్గించి, చర్మం ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తాయి.

## రోజుకో అరటిపండు తింటే..

శరీరంలో జరిగేది తెలిస్తే నోరెళ్లబెడతారు తక్కువ ధరలో.. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే అరటిపండు తింటే డాక్టర్‌కు దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో, ముఖ్యంగా జీర్ణవ్యవస్థను కాపాడటంలో అరటిపండును మించిన పండు లేదని పరిశోధనల్లో తేలింది. అందుకే దీనిని పొట్టకు అమృతం అని పిలుస్తారు. పోషకాల గని: ఒక అరటిపండును కేవలం చిరుతిండిగా చూడకూడదు. ఇది పోషకాల పవర్‌హౌస్. ఒక సాధారణ పరిమాణంలో ఉండే అరటిపండు సుమారు 105 కేలరీల శక్తిని అందిస్తుంది. ఇందులో 1.29 గ్రాముల ప్రోటీన్, 3.07 గ్రాముల ఫైబర్ ఉండటంతో పాటు విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. ముఖ్యంగా ఇందులో ఉండే 88.4 గ్రాముల నీటి శాతం శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొవ్వు శాతం దాదాపు శూన్యం కావడంతో బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. జీర్ణవ్యవస్థకు ప్రాణవాయువు: అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పని చేస్తుంది. ఇందులో ఉండే రెసిస్టెన్స్ స్టార్చ్, ప్రీబయోటిక్ ఫైబర్ పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా మారుతుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే యాంటీ అల్సర్ గుణాలు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గించడమే కాకుండా కడుపు లోపలి పొరను రక్షిస్తాయి. తద్వారా అల్సర్లు, మలబద్ధకం వంటి సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. రక్తపోటు నియంత్రణలో మేటి: ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవితంలో రక్తపోటు అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. అరటిపండులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తనాళాల ద ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజూ ఒక అరటిపండు తింటే గుండె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా స్ట్రోక్ వంటి ప్రమాదాలు దరిచేరకుండా ఉంటాయి. తక్షణ శక్తి – ఒత్తిడి నివారణ: పని ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా వ్యాయామం చేసిన తర్వాత నీరసంగా అనిపిస్తే.. అరటి పండు ఒక ఇన్స్టంట్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఇందులో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తినిస్తాయి. అంతేకాకుండా దీనిలోని యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి.



## చిన్న వయసులోనే పిల్లల్లో మానసిక సమస్యలు

### కారణం అదేనని అంటున్న నిపుణులు!



చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారి మానసిక, శారీరక అభివృద్ధి కుంటుపడుతుంది. కొంతమంది పిల్లలు ఈ మొబైల్ ఫోన్లకు ఎంతగా బానిసలయ్యారంటే తమ తల్లిదండ్రులతో కూడా సమయం గడపడం లేదు. వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కుంటే తీవ్ర స్థాయిలో కోపం, అసహనం, మానసిక ఒత్తిడిని ప్రదదర్శిస్తుంటారు. మొబైల్ ఫోన్లు, టీవీలు పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి కాలంలో పిల్లలు బయట ఆడుకునే బదులు టీవీ చూస్తూ, ఫోన్లు వాడుతూ సమయం గడుపుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది.న్యూరో కేర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాలీ జైన్ గుప్తా మాట్లాడుతూ.. సాధారణంగానే నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలకు తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు అల్లరి చేయకుండా ప్రశాంతంగా ఉంచడానికి మొబైల్ ఫోన్లు, టీవీల ముందు కూర్చోబెడుతున్నారు. ఇది పిల్లల మానసిక సమతుల్యతను మరింత దిగజార్చుతుంది. అంతేకాకుండా వారి సామాజిక, శారీరక అభివృద్ధి కూడా కుంగిపోతుంది. ఆటలు, క్రీడలు వంటి సహజ కార్యకలాపాలు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు తమకు తాముగా కఠినమైన పరిమితులను ఏర్పరచుకోవడం వంటి కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని అన్నారు. 2 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వారికి వీడియో కాల్స్ చేయడానికి కూడా అనుమతించకూడదు. ఈ వయస్సులో స్క్రీన్ వాడకంవల్ల మెదడు అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు స్క్రీన్ సమయం చాలా పరిమితం చేయాలి. చదవడానికి ఉపయోగించినప్పటికీ రోజుకు 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఇవ్వకూడదు. వారిని ఆన్‌లైన్ గేమ్స్, వీడియోలు, రీల్స్‌కు దూరంగా ఉంచాలి. వీటన్నిటితో పాటు మొబైల్ ఫోన్లు ఉపయోగించే సమయాన్ని పరిమితం చేయాలి.

## అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..

ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో రకాల విదేశీ ఆహార పదార్థాల కోసం వెతుకుతూ ఉంటాం. కానీ మన వంటగదిలోనే పోషకాల గని దాగి ఉందని చాలామందికి తెలియదు. అవే 'అవిసె గింజలు'. చూడటానికి చిన్నవిగా కనిపించినా, ఇవి చేసే మేలు మాత్రం అపారం. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్‌లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ంఒం) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది. మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా ప్ 2 దయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.




## ఈ మ్యాజిక్ డ్రింక్ తాగితే 30 రోజుల్లో పొట్ట కొవ్వుకు చెక్

బరువు తగ్గాలి అంటే గంటల తరబడి జిమ్‌లో కష్టపడాలి లేదా కడుపు మాడ్చుకుని కఠినమైన డైట్ పాటించాలి అని చాలామంది భయపడుతుంటారు. అయితే కేవలం వ్యాయామం, తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల మాత్రమే బరువు తగ్గడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను, విషతుల్యాలను ఎప్పటికప్పుడు బయటకు పంపడం కూడా అంతే ముఖ్యం. శరీరాన్ని లోపల నుంచి శుభ్రం చేయకపోతే రు ఎంత కష్టపడినా వెయిట్ లాస్ అనేది చాలా నెమ్మదిగా జరుగుతుంది. ఇక్కడే మనకు 'డిటాక్స్ డ్రింక్' ఎంతో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో మెటబాలిజం (జీవక్రియ) పాత్ర చాలా కీలకం. ఈ డిటాక్స్ డ్రింక్ కోసం ఒక గ్లాస్ బాటిల్‌లో రెండు స్పూన్ల స్వచ్ఛమైన తేనె, అర నిమ్మకాయ రసం తీసుకోవాలి. తేనె మన శరీరానికి తక్షణ శక్తిని ఇస్తే, నిమ్మకాయలోని సి విటమిన్ కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల శరీరంలోని మెటబాలిజం రేటు పెరుగుతుంది. అంటే రు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కూడా క్యాలరీలు ఖర్చయ్యేలా ఈ పానీయం ప్రోత్సహిస్తుంది. ఈ డ్రింక్‌లో మరో ముఖ్యమైన పదార్థం 'చియా విత్తనాలు'. ముందుగా నానబెట్టిన ఒక స్పూన్ చియా విత్తనాలను ఈ పానీయంలో కలుపుకోవాలి. వీటిలో ఫైబర్ (పీచు పదార్థం) పుష్కలంగా ఉండటం వల్ల వీటిని తీసుకున్న తర్వాత పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన సమయంలో ఆకలి వేయదు, తద్వారా రు జంక్ ఫుడ్ లేదా అధిక క్యాలరీలు ఉన్న ఆహారం తీసుకోకుండా ఉంటారు. బరువు తగ్గాలనుకునే వారికి అతిగా తినడం తగ్గించడమే అతిపెద్ద సవాలు.. ఆ సవాలును చియా విత్తనాలు సులభంగా అధిగమిస్తాయి. పైన చెప్పుకున్న పదార్థాలన్నింటినీ ఒక గ్లాస్ బాటిల్‌లో వేసుకుని, అందులో కొద్దిగా పుదీనా ఆకులు లేదా పుదీనా నీళ్లు పోసుకోవాలి. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ డ్రింక్‌ను తయారు చేసుకున్న వెంటనే తాగకూడదు. కనీసం ఒక గంట పాటు అలాగే ఉంచాలి. అప్పుడే అందులోని పోషకాలన్నీ నీటిలోకి చేరుతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగడం వల్ల ఫలితాలు ఇంకా వేగంగా ఉంటాయి. క్రమం తప్పకుండా 30 రోజుల పాటు ఈ డిటాక్స్ డ్రింక్ తీసుకుంటే శరీరంలో స్పష్టమైన మార్పులను గమనించవచ్చు. ముఖ్యంగా పొట్ట భాగంలో పేరుకుపోయిన మొండి కొవ్వు కరగడం మొదలవుతుంది. ఆకలి నియంత్రణలోకి వస్తుంది. శరీరం లోపల నుంచి శుభ్రపడటం వల్ల చర్మం కూడా కాంతివంతంగా మారుతుంది. అలసట తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇలాంటి డిటాక్స్ డ్రింక్స్‌ను జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన రీతిలో ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు. అయితే దీనితో పాటు తగినంత నీరు తాగడం, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం కూడా ముఖ్యమే.




## ఫిట్‌నెస్ అంటే ప్రాణమా..! బాడీ డీహైడ్రేట్ కాకుండా చేసే మ్యాజిక్

ఆరోగ్యకరమైన జీవనశైలిలో వ్యాయామం ఎంత ముఖ్యమో, దానికి తగిన పోషకాహారం అందించడం కూడా అంతే ముఖ్యం. చాలా మంది ఉదయాన్నే నిద్రలేవగానే ఏ తినకుండానే జిమ్‌కు లేదా రన్నింగ్‌కు వెళ్తుంటారు. ఖాళీ కడుపుతో వర్కవుట్ చేయడం వల్ల శరీరం త్వరగా అలసిపోవడమే కాకుండా, కండరాల పటుత్వం కూడా దెబ్బతినే అవకాశం ఉంది.కానీ వ్యాయామానికి ఒక 30 నుంచి 45 నిమిషాల ముందు ఏదైనా ఒక పండు తింటే శరీరానికి అందే శక్తి అద్భుతంగా ఉంటుంది. పండ్లలో ఉండే సహజ చక్కెరలు శరీరానికి తక్షణ ఇంధనాన్ని అందిస్తాయి. పండ్లలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. ఇవి రక్తంలోకి త్వరగా చేరి మెదడుకు, కండరాలకు తక్షణ శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అరటిపండు వంటి పండ్లు కార్బోహైడ్రేట్లకు నిలయాలు. ఇవి వ్యాయామం పూర్తయ్యే వరకు శక్తి స్థాయిలను పడిపోకుండా స్థిరంగా ఉంచుతాయి. దీనివల్ల మధ్యలోనే నీరసం రాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. బరువైన ఆహారం తిని వ్యాయామం చేయడం వల్ల కడుపులో అసౌకర్యం కలుగుతుంది. కానీ పండ్లు చాలా తేలికగా ఉండి, త్వరగా జీర్ణమవుతాయి. వీటిలోని ఫైబర్ నెమ్మదిగా శక్తిని విడుదల చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల వర్కవుట్ మధ్యలో ఆకలి వేయకుండా ఉండటమే కాకుండా, శరీరం చాలా తేలికగా అనిపిస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు చెమట ద్వారా పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలను మన శరీరం కోల్పోతుంది. అరటిపండ్లు, నారింజ వంటి పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది కండరాలు పట్టేయకుండా కాపాడుతుంది. అంతే కాకుండా గుండె స్పందనను క్రమబద్ధీకరించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.బెర్రీలు, యాపిల్స్, ద్రాక్ష వంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వ్యాయామం చేసేటప్పుడు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. పండ్లలోని పోషకాలు కణాల నష్టాన్ని నివారించి, కండరాలు త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి. వ్యాయామం తర్వాత వచ్చే నొప్పులను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీ వంటి పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఉదయాన్నే వర్కవుట్ చేసేటప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఇవి కాపాడతాయి. శరీరానికి అవసరమైన తేమను అందిస్తూనే వర్కవుట్ ఎఫెక్టివ్‌గా జరిగేలా చూస్తాయి. అరటిపండు బెస్ట్ ప్రీ-వర్కవుట్ ఫుడ్. ఇందులోని పొటాషియం కండరాల పని తీరును మెరుగుపరుస్తుంది. యాపిల్ లోని పీచు పదార్థం, సహజ చక్కెరలు రోజంతా స్థిరమైన శక్తిని ఇస్తాయి. నారింజ విటమిన్ సి, నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.



## వ్యాయామం చేయలేకపోతున్నారా?

ఈ రోజుల్లో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరికీ అవసరం. ముఖ్యంగా ఇల్లు, ఆఫీసు బాధ్యతలతో సతమతమయ్యే మహిళలు తప్పనిసరిగా కొంత సమయాన్ని ఇందుకోసం కేటాయించుకోవాలి. అయితే, చాలా గట్టి తీర్మానం చేసుకున్నా ఆచరణలో అమలు చేయలేకపోతారు చాలామంది. అలాంటివారిలో మీరూ ఉన్నారా? అయితే ఇలా చేసి చూడండి. వ్యాయామం చేయాలంటే పొద్దున్నే నిద్రలేవాలి. ఆలస్యంగా నిద్రపోయే అలవాటు ఉన్న చాలామందికి ఇది చాలా కష్టమైన పని. ఇంకొందరికేమో ఉదయాన్నే వంట చేయాలి. పిల్లల్ని స్కూలుకి పంపాలి... ఇలా బోలెడు పనులుంటాయి.



మీదీ అదే పరిస్థితా? అలాగని వర్కవుట్‌లకు దూరమైతే ఎలా? రోజులో కనీసం అరగంటైనా సమయం దొరుకుతుందేమో చూడండి. అప్పుడే కేటాయించుకోండి. ఇవేవీ కాదంటూ ఇంటి పనుల్లో భాగంగానే... ఏ పని చేస్తే ఎంత వ్యాయామ ఫలితం వస్తుందో చూసి దాన్ని ఒత్తిడితో కాకుండా మైండ్ ఫుల్‌గా చేయండి. ఆఫీసుకి వెళ్లేటప్పుడు మెట్లెక్కడం, తిరిగి వచ్చేటప్పుడు నడవడం బాగానే ఉంటుంది కానీ... అందుకు అవసరమైన శక్తి మీకుందో లేదో చూసుకోండి. లేదంటే మీ డైట్‌లో ప్రొటీన్ శాతం పెంచండి. అప్పుడే కేవలం అది ఆలోచనగా మారిపోకుండా ఎనర్జీతో ముందడుగు వేయగలరు. నిజానికి ఉదయం నిద్రలేస్తే చాలా సమస్యలు దూరమవుతాయి. ఇందుకోసం ముందు రోజు షెడ్యూల్‌ని కాస్త ముందుకు జరిపితే.... త్వరగా పడుకోగలరు. అలానే రోజూ మీరు ఆరింటికి నిద్రలేస్తుంటే... 5.30కే లేచి ఓ వారం రోజులు అలా టెర్రస్ మీదో, వీధి అరుగుమీదో కూర్చోండి. క్రమంగా శరీరం ఆ సమయానికి అలవాటు పడుతుంది. నెమ్మదిగా ఆ టైమ్‌ని కసరత్తుల కోసం ఉపయోగించుకోండి. అలానే పొద్దున్నే హడావుడీ, ఒత్తిడీ లేకుండా ఉండాలంటే... కొన్నిపనులు ముందు రోజు చేసి పెట్టుకుంటే చాలు. నిద్రలేచిన వెంటనే నడకకో, జిమ్‌కో నేరుగా వెళ్తున్నారా? దానివల్ల రోజూ వ్యాయామం చేయాలన్న ఆసక్తి తగ్గుతుంది. రాత్రంతా మీరు మంచినీళ్లు తాగకుండా ఉంటారు. దానివల్ల శరీరానికి డీహైడ్రేషన్ ఎదురవుతుంది. నిద్రలేచాక గ్లాసు మంచినీళ్లు తాగండి. చిన్నచిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి. ఇవన్నీ చేయడం మొదలుపెడితే...క్రమంగా వ్యాయామం చేయడానికి అలవాటు పడతారు.

## అతి వద్దు సుమీ!

అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా? వ్యాయామం చేయడం వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది. అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలొరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది. మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు.



# ఫార్మాకు ముడిపదార్థాల సరఫరా పెంపు

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, ఔషధ రంగానికి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాను ప్రభుత్వం పెంచుతోంది. దేశీయంగా ప్రాణరక్షక ఔషధాల తయారీలో ఆటంకాలు ఎదురవ్వకుండా చూసేందుకు ప్రాధాన్యమిస్తోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందు, ఔషధ రంగానికి ముడిపదార్థాలు గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయం ద్వారా అధికంగా వచ్చేవి. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లేవి. యుద్ధం వల్ల ఈ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. అయినా కూడా ఔషధ రంగానికి కీలకమైన ప్రొపిలీన్, అమ్మోనియా, థేన్ వంటి వాటిని, ప్రాధాన్యతకు అనుగుణంగా, దామాషా పద్ధతిలో ఔషధ సంస్థలకు అందిస్తున్నట్లు ఔషధశాఖ సంయుక్త కార్యదర్శి టీఎల్ సత్యప్రకాశ్ వెల్లడించారు. ప్రొపిలీన్‌ను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సహా దేశీయ రిఫైనరీలే ఔషధ కంపెనీలకు అందిస్తున్నాయని తెలిపారు. ఐబ్రూఫిన్ వంటి ఔషధాలకు కావాల్సిన ఐసోప్రొపైల్ ఆల్కహాల్, ఐసోబుల్ బెంజీన్ వంటి ఇంటర్మీడియెట్ల తయారీ కోసం ప్రొపిలీన్‌ను వినియోగిస్తారు. అమ్మోనియాను ఎరువుల రంగం నుంచి బదిలీ చేస్తున్నారు. ఇటీవల మెథనాల్ లభ్యతపై ఆందోళన నెలకొంది.




# రిఫైనరీ మార్జిన్లపై పరిమితి

## దేశీయ ఇంధన విక్రయాలపై నష్టాలు తగ్గించడానికే




దేశీయంగా ఇంధన సరఫరా మెరుగు పరచేందుకు, ఎగుమతుల పై విండ్‌ఫాల్ పన్ను విధించిన ప్రభుత్వం.. తాజాగా రిఫైనరీ మార్జిన్లపై పరిమితి విధిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బాగా పెరిగినా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించ లేదు. దీనివల్ల చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) భారీగా నష్టపోతున్నాయి. ముడిచమురును శుద్ధి చేసి, పెట్రోల్ డీజిల్ వంటి ఇంధనాలుగా మార్చే రిఫైనరీలు మాత్రం.. ఓఎంసీలకు దిగుమతి ధర ప్రకారమే సరఫరా చేయడం ఇందుకు నేపథ్యం. ఓఎంసీలకు నష్టాలు తగ్గించేందుకే రిఫైనరీ మార్జిన్లలో కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దేశీయ సరఫరాల్లో కొరత నివారణకు: అంతర్జాతీయంగా చమురు సరఫరాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దేశీయంగా కూడా ఈ ప్రభావం పడుతోంది. ముడిచమురును ఇక్కడ శుద్ధి చేసి, విదేశాలకు పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేస్తే కంపెనీలకు అధిక లాభం వస్తుంది. అయితే సరఫరాలు తక్కువగా ఉన్నందున, దేశీయంగా కొరత తలెత్తకుండా చూసేందుకు గత నెలలో డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై ప్రత్యేక అదనపు సుంకాన్ని (ఎస్ఏఈడీ) ప్రభుత్వం విధించింది. దీంతో పాటు రిఫైనింగ్ మార్జిన్‌ను బ్యారెల్‌కు 15 డాలర్లకు పరిమితం చేసినట్లు సమాచారం. ఇప్పటికే లీటరుకు రూ.60 తగ్గించి ఇస్తున్న ఓఎంసీలు: రిఫైనరీలు దిగుమతి చేసుకుని, తమకు విక్రయించే పెట్రోలియం ఉత్పత్తుల పై లీటరుకు రూ.60 వరకు తగ్గించి చెల్లించాలని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఇప్పటికే నిర్ణయించాయి. మార్చి ద్వితీయార్థానికి లీటర్ డీజిల్‌పై రూ.22.34, ఏప్రిల్ తొలి పక్షం రోజులకు రూ.60.24 తగ్గించి చెల్లిస్తున్నారు. ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.50.56 రాయితీ, కిరోసిన్‌పై లీటరుకు రూ.46.31 తగ్గిస్తున్నట్లు సమాచారం.

# సిప్ పెట్టుబడుల్లో సరికొత్త రికార్డు




మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి మార్చి నెలలో సిప్ పెట్టుబడులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో సిప్ రూపంలో రూ.29,845 కోట్లు రాగా.. మార్చిలో సిప్ ఇన్‌ఫ్లోలు 8 శాతం వృద్ధితో రూ.32,087 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది మార్చిలో నమోదైన రూ.25,925 కోట్లతో పోలిస్తే ఈ తరహా పెట్టుబడుల్లో 24 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (Amfi) మార్చి నెల గణాంకాలను శుక్రవారం వెలువరించింది. భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధులు ప్రవాహం కొనసాగింది. అంతకుముందు నెలతో పోలిస్తే 56 శాతం వృద్ధితో రూ.40,450 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు యాంఫీ వెల్లడించింది. మార్కెట్ ఒడుదొడుకులు, అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగినప్పటికీ ఈక్విటీ పథకాల పట్ల నమ్మకాన్ని ఇది తెలియజేస్తోందని యాంఫీ పేర్కొంది. ముఖ్యంగా ఫ్లెక్సీ క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ పథకాల్లోకి ఎక్కువ నిధులు వెళ్లాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.10వేల కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,263 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,063 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ ఫండ్స్ నుంచి నిధులు తరలివెళ్లాయి. అదే సమయంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,266 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఫిబ్రవరితో (రూ.5,255 కోట్లు) పోలిస్తే తగ్గుముఖం పట్టాయి. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ పథకాల నుంచి మార్చి నెలలో రూ.2.4 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి.

# ఇకపై ఆ వీడియోలకు చెక్

## ఇన్‌స్టాగ్రామ్ నిబంధనల్లో కీలక మార్పులు..!



సోషల్ డియా దిగ్గజం మెటా, టీనేజర్ల భద్రత కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో చారిత్రాత్మకమైన మార్పులను ప్రకటించింది. సున్నితమైన, అభ్యంతరకర కంటెంట్ నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను రక్షించడానికి ప్రపంచవ్యాప్తంగా కఠినమైన ఫిల్టర్లను అమల్లోకి తెచ్చింది. ఇకపై మైనర్ల ఫీడ్‌లో అభ్యంతరకర పోస్ట్‌లకు తావులేకుండా ఆటోమేటిక్ సెట్టింగ్‌లను సంస్థ సిద్ధం చేసింది. నేటి కాలంలో సోషల్ డియా ప్రభావం చిన్న పిల్లలపై తీవ్రంగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, మైనర్ల మానసిక ఆరోగ్యం, భద్రత కోసం మెటా సంస్థ తన కంటెంట్ పాలసీని పూర్తిగా సవరించింది. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వినియోగదారుల కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసింది. అమెరికా వంటి దేశాల్లో ఎదుర్కొంటున్న చట్టపరమైన ఒత్తిడి, వినియోగదారుల ఆందోళనల నేపథ్యంలో ఈ గ్లోబల్ అప్‌డేట్ విడుదలైంది. ఈ కొత్త భద్రతా అప్‌డేట్ వల్ల టీనేజర్లు ఇకపై ఇన్‌స్టాగ్రామ్‌లో హింస, నగ్నత్వం, మత్తు పదార్థాల వాడకం, ప్రాణాపాయం కలిగించే సాహసకృత్యాలకు సంబంధించిన వీడియోలను చూడలేరు. ఒకవేళ ఎవరైనా టీనేజర్ అటువంటి విషయాల కోసం వెతికినా, అల్గోరిథం వాటిని గుర్తించి వెంటనే బ్లాక్ చేస్తుంది లేదా దాచిపెడుతుంది. ఈ మార్పులు మైనర్ల ఖాతాలకు వర్తిస్తాయి. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, పిల్లలు ఈ సెట్టింగ్‌లను స్వయంగా మార్చుకోలేరు. దీని కోసం వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కేవలం వీడియోలే కాకుండా, ఇన్‌స్టాగ్రామ్ 'పరిమిత కంటెంట్' అనే కొత్త ఫీచర్‌ను కూడా ప్రవేశపెట్టింది.




# నకిలీ పాస్‌లతో స్టేడియాల్లోకి ఎంట్రీ

ఐపీఎల్2026లో ఈ నెల 4న ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో టికెట్ ఫ్రాడ్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(డీడీసీఏ) డైరెక్టర్ అనంద్ వర్మనే ఈ ఆరోపణలు చేయడం చర్చకు దారితీసింది. టికెట్ హోల్డర్ల కంటే ముందే గుర్తు తెలియని వ్యక్తులు డుప్లికేట్ పాస్‌లను స్కాన్ చేసి స్టేడియంలోకి ప్రవేశించారని తెలిపారు. ఈ అనుభవం తనకే జరిగిందని వివరించారు. 'నేను, నా అతిథులు హాస్పిటాలిటీ సెక్షన్‌కు చెల్లుబాటయ్యే టికెట్లతోనే వెళ్లాం. కానీ, మిమ్మల్ని ఎంట్రీ గేట్ వద్దే ఆపారు. నా వద్ద ఉన్న టికెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ముందే స్కాన్‌కు ఉపయోగించారు.' అని తెలిపారు. ఈ మేరకు సెంట్రల్ డిస్ట్రిక్ట్ డీసీపీకి ఆనంద్ వర్మ ఫిర్యాదు చేశారు. అలాగే, ఈ విషయాన్ని డీడీసీఏ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మనన్ గుప్తా, ప్రెసిడెంట్ రోహన్ జైట్లీకి తెలియజేశారు.

# బంగ్లా క్రికెటర్ల వేతనాలు పెంపు




దేశవాళీ క్రికెట్‌లో మహిళలు ఓ వన్డే మ్యాచ్ ఆడితే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అందించే మ్యాచ్ ఫీజు రూ.750 (వెయ్యి బంగ్లా టాకాలు). బీసీబీ నూతన అధ్యక్షుడిగా పగ్గాలు అందుకున్న తమ్ ఇక్బాల్ ఈ విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు. క్రికెట్ ఆర్థిక వ్యవస్థకు మూలం క్రికెటర్లు. సముచిత మ్యాచ్ ఫీజులు బోర్డు కనీస బాధ్యతగా భావిస్తూ..తమ్ ఇక్బాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళలకు టీ20లకు (టాకాల్లో) 10 వేలు, వన్డేలకు 15 వేలు, ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లకు 20 వేలు ఫీజుగా అందుకోనున్నారు. దేశవాళీ క్రికెట్‌లో 36 మంది మహిళా క్రికెటర్ల వేతనాలను 30 వేల నుంచి 40 వేలకు పెంపుదల చేశారు.

దేశవాళీ మెన్స్ క్రికెటర్ల వేతనాలను సైతం బీసీబీ సవరించింది. కేటగిరీఏ క్రికెటర్లు నెలకు 65 వేలు, కేటగిరీబి క్రికెటర్లు 50 వేలు, కేటగిరీసి క్రికెటర్లు 40 వేలు వేతనంగా తీసుకోనున్నారు. ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఫీజును 70 వేల నుంచి 1 లక్షకు పెంచారు. 'గత 34 ఏండ్లుగా క్రికెటర్ల వేతనాలను స్వల్పంగా పెంచారు. గత వేతన పద్ధతిలో క్రికెటర్లకు ఎంతో తక్కువ జీతాలు ఇచ్చారు.

క్రికెటర్లు ఎంతో కష్టపడతారు, వాళ్ల శ్రమతోనే క్రికెట్ నిలబడింది. మెరుగైన వేతనాలకు క్రికెటర్లు అర్హులు' అని తమ్ ఇక్బాల్ తెలిపాడు. 2026 జనవరి 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి వస్తాయని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తెలిపింది.



### ఆసియా బ్యాడ్మింటన్‌లో

# సింధుకు షాక్

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో భారీ షాక్ తగిలింది. స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సింధు 1821, 821 తేడాతో చైనాకు చెందిన వాంగ్ జి యి చేతిలో ఓడిపోయింది. 46 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సింధు ప్రత్యర్థికి గట్టి పోటీనివ్వలేకపోయింది. తొలి గేములో పోరాడినా చైనా ప్లేయర్‌ను నిలువరించలేకపోయింది. ఇక రెండో గేములో పూర్తిగా తేలిపోయి ఓటమిని అంగీకరించింది. ఇప్పటికే లక్ష్యసేన్ ఇంటిదారిపట్టగా..

పతకం తెస్తుందనుకున్న సింధు కూడా నిరాశపర్చింది. యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా రెండో రౌండ్‌లో ఇంటిదారిపట్టింది. జపాన్‌కు చెందిన మియాజకీ చేతిలో 2117, 219 తేడాతో ఓడిపోయింది. స్టార్ ప్లేయర్ హెచ్.ఎస్ ప్రణయ్ కూడా రెండో రౌండ్‌లో తన ప్రయాణాన్ని ముగించాడు. చైనాకు చెందిన వెంగ్‌తో తలపడిన అతను 2112, 2119తో ఓటమిపాలయ్యాడు

. లక్ష్యసేన్, సింధు, ప్రణయ్, శ్రీకాంత్ నిరాశపర్చిన వేళ యువ ప్లేయర్ ఆయుశ్ శెట్టి పతక ఆశలు రేపుతున్నాడు. ఈ యువ ప్లేయర్ తొలి రౌండ్‌లో వరల్డ్ నం.7 ఆటగాడికి షాకిచ్చిన విషయం తెలిసిందే. టోర్నీలో అతను మరో విజయం నమోదు చేశాడు. రెండో రౌండ్‌లో ఆయుశ్ 2116, 2112 తేడాతో చైనీస్ తైపీ ఆటగాడు చి యు జెన్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. ప్రస్తుతం టోర్నీలో భారత్ తరపున మిగిలిన ఏకైక ప్లేయర్ అతనే.

# భారత్‌తో టెస్టుకు రషీద్ దూరం!



అఫ్గనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ రెడ్ బాల్ ఫార్మాట్‌కు దూరం కానున్నాడు. వెన్ను గాయానికి గురైన రషీద్ ఖాన్.. కెరీర్‌ను పొడిగించుకునేందుకు ఐదు రోజులకు ప్రాధాన్యత ఇవ్వటం లేదు. ఏడాదిలో ఒక్క టెస్టు మాత్రమే ఆడేందుకు అఫ్గనిస్తాన్ క్రికెట్ బోర్డుతో అంగీకారం కుదుర్చుకున్న రషీద్ ఖాన్.. చివరగా 2025 జనవరిలో జింబాబ్వేతో టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ 55 ఓవర్లు బౌలింగ్ చేశాడు. 'జింబాబ్వేతో టెస్టులో నేను 55 ఓవర్లు బౌలింగ్ చేశాను. క్రికెట్‌కు దూరం కావాలని అనుకుంటే..రెడ్‌బాల్ ఫార్మాట్‌లో కొనసాగు అని వైద్యులు హెచ్చరించారు. వైద్యుల సూచన లెక్క చేయకుండా ఆ మ్యాచ్‌లో ఆడాను' అని రషీద్ ఖాన్ అన్నాడు.


ఈ ఏడాది జూన్ 6 నుంచి భారత్, అఫ్గనిస్తాన్ ఏకైక టెస్టు మ్యాచ్ చంఢగీడ్‌లో జరుగనుంది. ఈ ఏడాది రషీద్ ఖాన్ ఓ టెస్టు మ్యాచ్ ఆడాల్సి ఉన్నప్పటికీ.. ఐపీఎల్ పని ఒత్తిడి, తదితర కారణాలతో భారత్‌తో టెస్టుకు రషీద్ ఖాన్ దూరం కానున్నాడని సమాచారం. ఈ అంశంలో ఇప్పటికే అఫ్గాన్ క్రికెట్ బోర్డుకు రషీద్ ఖాన్ సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. అఫ్గనిస్తాన్ తరపున టీ20, వన్డేల్లో రషీద్ ఖాన్ రెగ్యులర్‌గా ఆడనున్నాడు. 2018లో టెస్టుల్లో అరంగ్రేటం చేసిన రషీద్ ఖాన్ ఆరు టెస్టుల్లో 20.44 సగటుతో 45 వికెట్లు పడగొట్టాడు.

# ఓడిపోయే మ్యాచ్ గెలిపించిన ముకుల్




కేకేఆర్ చేతిలో ఓడిపోవాల్సిన లక్నోను చివరి క్షణంలో గెలిపించాడు ముకుల్ చౌదరి. దీంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు. సోషల్ డియా ఓపెన్ చేస్తే చాలు..ముకుల్ చౌదరి గురించే వార్తలు వైరల్ అవుతున్నాయి. కేకేఆర్ వర్సెస్ లక్నో మధ్య గురువారం మ్యాచ్ జరగగా, 27 బంతుల్లో 54 పరుగులు చేసి ఒ•ఉని విజయ తీరాలకు చేర్చాడు ముకుల్ చౌదరి. ఈ మ్యాచ్ లో ఏకంగా ఏడు సిక్సర్లు కొట్టిన ముకుల్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా సొంతం చేసుకున్నాడు. అచ్చం మహేంద్ర సింగ్ ధోని లాగా హెలికాప్టర్ షాట్ కూడా నిన్నటి మ్యాచ్ సందర్భంగా ఆడాడు. దీంతో ఇండియాకు మరో ధోని దొరికాడని సోషల్ డియాలో కామెంట్ చేస్తున్నారు. కేకేఆర్ పై విధ్వంసం సృష్టించిన లక్నో ఆటగాడు ముకుల్ చౌదరి, తన ఇన్నింగ్స్ ను ధోనీకి డెడికేట్ చేసినట్లు తెలిపాడు. తాను ధోని బ్యాటింగ్ చూస్తూ పెరిగానని, అతని బ్యాటింగ్ ఆర్డర్ లోనే వస్తానని ప్రకటించాడు. తన కెరీర్ ఆరంభంలో ధోనినే తనకు అతిపెద్ద స్ఫూర్తి అంటూ వ్యాఖ్యానించారు. దీంతో మరో క్రికెటర్ కు ధోని స్ఫూర్తిగా నిలిచాడని సోషల్ డియాలో ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రాజస్థాన్ లో జన్మించిన ముకుల్ చౌదరి, తన తండ్రి కోరిక మేరకు క్రికెటర్ అయ్యాడు. మొదట్లో ఫాస్ట్ బౌలింగ్ చేసిన ముకుల్, ధోని స్ఫూర్తితో వికెట్ కీపర్ గా మారాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా 200 స్ట్రైక్ రేటుతో దుమ్ము లేపాడు. ఈ క్రమం లోనే రూ .2.6 కోట్లకు ముకుల్ ను లక్నో కొనుగోలు చేసింది.

# క్వార్టర్స్‌కు ఆయుష్ శెట్టి




ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో యువ షట్లర్ ఆయుశ్ శెట్టి అదరగొడుతున్నాడు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించగా.. ప్రి క్వార్టర్స్‌కు చేరిన ఆయుష్ శెట్టి అదే స్థాయి ప్రదర్శనను నేటి మ్యాచ్‌లోనూ చూపాడు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో ఆయుష్ శెట్టి 2116, 2117తో ప్రపంచ 7వ ర్యాంకర్, చైనాకు చెందిన లీషెంగ్‌ఫెన్‌ను ఓడించి క్వార్టర్స్‌కు చేరాడు. శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో 20ఏళ్ల ఆయుష్ శెట్టి సెస్ బెర్త్ కోసం ఇండోనేషియాకు చెందిన 2024 ఛాంపియన్ జొనాథన్ క్రిస్టీతో తలపడనున్నాడు. ఇక హెచ్‌ఎస్ ప్రణరు రారు 1221, 1921తో చైనాకు చెందిన వెంగ్‌హాంగ్‌యంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లోనూ భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో పివి సింధు 1821, 821తో ప్రపంచ 2వ ర్యాంకర్, చైనాకు చెందిన వాంగ్‌జీ చేతిలో, ఉన్నతి హుడా 1721, 921తో జపాన్‌కు చెందిన 9వ ర్యాంకర్ టొమోకా మియాజికాయా చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

# ఎట్టకేలకు బౌలింగ్ చేసిన కామెరాన్ గ్రీన్



కేకేఆర్ డేంజర్ ప్లేయర్ కామెరాన్ గ్రీన్ ఎట్టకేలకు బౌలింగ్ చేసి, సత్తా చాటాడు. అంతేకాదు తన తొలి ఓవర్ లోనే లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ వికెట్ కూడా పడగొట్టాడు. రూ. 25.2 కోట్లు పెట్టి కామెరాన్ గ్రీన్ ను కేకేఆర్ కొనుగోలు చేసింది

. దీంతో ఐపీఎల్ 2026 నేపథ్యంలో చివరి క్షణంలో జట్టులో చేరాడు గ్రీన్. ఈ క్రమంలో మొదటి మూడు మ్యాచులు ఆడిన గ్రీన్, బ్యాటింగ్ చేశాడు కానీ బౌలింగ్ చేయలేదు. దీంతో మాజీ క్రికెటర్లు ఈ అంశంపై చాలా సీరియస్ అయ్యారు. రూ.25 కోట్లు పెట్టి కొనుగోలు చేస్తే బౌలింగ్ చేయడా ? అంటూ గ్రీన్ ను టార్గెట్ చేసి విమర్శలు చేశారు. కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే పెదవి విరిచాడు. ఇన్ని వివాదాల నేపథ్యంలో లక్నోతో గురువారం జరిగిన మ్యాచ్ సందర్భంగా బౌలింగ్ చేశాడు గ్రీన్. అంతేకాదు తన తొలి ఓవర్ లో పంత్ వికెట్ పడగొట్టాడు. ఈ క్రమంలో గ్రీన్ బౌలింగ్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా వెన్నునొప్పి నుంచి కోలుకుంటోన్న గ్రీన్, ఫిట్ నెస్ లేక బౌలింగ్ చేయడం లేదు. ఈ విషయంపై ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియా అధికారిక ప్రకటన కూడా చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా ఆదేశాల నేపథ్యంలో మొదటి మూడు మ్యాచ్ లలో బ్యాటింగ్ మాత్రమే చేశాడు గ్రీన్. ఏమైందో తెలియదు కానీ లక్నోతో మ్యాచ్ లో బౌలింగ్ కూడా చేసి విమర్శలకు చెక్ పెట్టాడు.




## జయహో జనార్ధన పోస్టర్ లాంచ్




పానుగంటి ప్రొడక్షన్స్ పతాకంపై పానుగంటి శరత్ రెడ్డి నిర్మాతగా దర్శకుడుగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న సినిమా జయహో జనార్ధన. నరేష్ వాసం, రమ్యశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో 30 ఇయర్స్ పృథ్వీ, రోలర్ రఘు, చలాకి చంటి, మైమ్ మధు, దయానంద రెడ్డి, జబర్దస్త్ రాఘవ, జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ రాజమౌళి, పటాస్ ప్రవీణ్, నెమలి రాజు, బివిఎం శివశంకర్ ఇతర ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఎడిటర్ గా నందమూరి హరి, కెమెరామెన్ గా విజయ్ ఠాగూర్ ఆర్ డైరెక్టర్ గా భూపతి యాదగిరి పనిచేయగా మ్యూజిక్ అందించింది చరణ్ అర్జున్. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్ లాంచ్ విజనరీ డైరెక్టర్ సంపత్ నంది గారి చేతుల మీదుగా జరిగింది. నిర్మాత, దర్శకుడు మాట్లాడుతూ.. నిర్మాత, దర్శకుడు పానుగంటి శరత్ రెడ్డి ని మరియు మూవీ టీం ని అభినందించి సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## రాకాస సింగిల్ స్క్రీన్స్‌లో టికెట్ ధర ఫిక్స్




జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల 'రాకాస' చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న రిలీజ్ చేశారు. డిఫరెట్ ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ దూసుకెళ్తోంది. ఏపీ, తెలంగాణలో శ్రీలక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్ బ్యానర్‌పై విడుదలైన చిత్రం ఇప్పటికే మంచి కలెక్షన్స్‌ను రాబడుతూ ఫన్‌టాస్టిక్ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకెళ్తోంది.

లేటెస్ట్ గా మేకర్స్ ఈ సినిమాను ప్రేక్షకులకు మరింత చేరువ చేసే పనిలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని సింగిల్ స్క్రీన్స్ లో టికెట్ ధరను రూ. 100గా ఫిక్స్ చేశారు. దీంతో రాకాస చిత్రం సామాన్యుడికి మరింత చేరువ కానుంది. చక్కటి అర్థవంతమైన కామెడీతో ఈ సినిమా అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తోంది. సంగీత్, గెటప్ శీను ట్రాక్ ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో పాటు వెన్నెల కిషోర్ కామెడీ టైమింగ్, నటనకు సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. దీంతో ప్రేక్షకులు ఈ సమ్మర్‌లో కుటుంబంతో కలిసి ఈ సినిమాను చూడటానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు.



## డిస్ట్రిబ్యూటర్ల హ్యాపీని చూసుకుంటాను

### 'రాకాస' బ్లాక్ బస్టర్ డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్‌లో నిహారిక కొణిదెల



మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద ఉమేష్ కుమార్ బన్సల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. ఈ మూవీలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాకి మానస శర్మ దర్శకత్వం వహించారు. గత వారం విడుదలైన ఈ చిత్రం అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించింది. ఈ మూవీ సాధించిన విజయాన్ని సెలెబ్రేట్ చేసేందుకు డిస్ట్రిబ్యూటర్లంతా కలిసి బ్లాక్ బస్టర్ డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మాజీ, మైత్రి రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. "రాకాస'ని చూసిన ప్రతీ ఒక్క ఆడియెన్‌కి పర్సనల్‌గా థాంక్స్ చెప్పాలని ఉంది. కానీ అది అసాధ్యం. మా డిస్ట్రిబ్యూటర్లందరూ హ్యాపీగా ఉన్నారంటే అది నిజమైన విజయం అని నాకు అనిపిస్తోంది. మా మూవీని చూసి ఎంజాయ్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా మీదున్న నమ్మకంతో 'రాకాస'ని తీసుకుని డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను చేసే ప్రతీ సినిమాతో డిస్ట్రిబ్యూటర్లు హ్యాపీగా ఉండేలా చూసుకుంటాను.

## ఆడియన్స్ కి థాంక్యూ


### ప్రెస్ మీట్ లో హీరో అడివి శేష్




హిట్ మిషన్ అడివి శేష్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'డెకాయిట్. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. షానియల్ డియో దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. హైదరాబాద్ లో ప్రేక్షకులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించిన చిత్ర యూనిట్ అనంతరం ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. ప్రెస్ మీట్‌లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాను మనసుపెట్టి చేశాము. మీరు కూడా మనసుతో చూసి ఆదరించారు. థాంక్యూ సో మచ్. డెకాయిట్ లో సరస్వతి పాత్ర చేసిన మృణాల్ మా హీరో(నవ్వుతూ). షానియల్ నా బెస్ట్ ఫ్రెండ్. ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా పరిచయం అయ్యారు. చాలా ఎమోషనల్‌గా ఉన్నాను. ఇక్కడి నుంచి మీ అందరికీ ప్రేమ పంచడానికి చాలా నగరాలు తిరుగుతాము. మరో సక్సెస్ ఇచ్చినందుకు థాంక్యూ సో మచ్. ప్రేమతో ఈ సినిమా చేశాము. మీరు కూడా ప్రేమతో చూశారు. థాంక్యూ. లవ్ యు.

## ఈ నెలాఖరులో రాక్షసపురం

రాజ్ బి శెట్టి హీరోగా నటించిన కన్నడ సూపర్ హిట్ మూవీ రక్కసపురదోల్ ను తెలుగు ప్రేక్షకుల ముందుకు రాక్షసపురం టైటిల్ తో తీసుకొస్తున్నారు ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు. ఈ చిత్రాన్ని కె.ఎస్. ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై కె. రవివర్మ నిర్మించారు. రవి సారంగ దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు సమర్పణలో రాక్షసపురం సినిమా క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్ పై త్వరలో తెలుగులో రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత కె.ఎస్ రామారావు హైదరాబాద్ ఎఫ్‌ఎన్‌సీసీలో జరిగిన కార్యక్రమంలో చిత్ర విశేషాలను తెలిపారు. ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు మాట్లాడుతూ నా కెరీర్ డబ్బింగ్ చిత్రంతోనే ప్రారంభమైంది. కమల్ హాసన్ నటించిన ఎర్రగులాబీలు చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేశాను. ఆ సినిమా ఘన విజయం సాధించింది. ఇప్పుడు కొంత విరామం తర్వాత మళ్లీ మా క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్ పై రాక్షసపురం అనే మూవీని తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నా. ఈ చిత్రాన్ని ఒక డిఫరెంట్ క్రైమ్ థ్రిల్లర్ గా దర్శకుడు రవి సారంగ అద్భుతంగా రూపొందించాడు. నా స్నేహితుడు రవివర్మ నిర్మించాడు. ఈ సినిమా చూశాక థ్రిల్ అయ్యాను. ప్రొడ్యూసర్ రవివర్మకు ఫోన్ చేసి నేను ఈ సినిమా తెలుగులో రిలీజ్ చేస్తానని చెప్పాను. ఈ చిత్రంలో హీరో రాక్షస సంహారం చేస్తుంటాడు. అది ఒక ఊరిలో జరుగుతుంటుంది. అందుకే టైటిల్ రాక్షసపురం అని పెట్టారు. నేను 86లో చిరంజీవి గారితో రాక్షసుడు అనే చిత్రాన్ని రూపొందించాను. ఆ సినిమా టైటిల్ కొందరికి నెగిటివ్ గా అనిపించింది. కానీ హీరో చేసేవన్నీ మంచి పనులే, కథ మంచిదే. హీరో విలన్స్ కు రాక్షసుడు కాబట్టి ఆ టైటిల్ పెట్టాం. ఈ రాక్షసపురంలో కూడా హీరో రాక్షసుల్లాంటి విలన్స్ ను సంహరిస్తాడు. ఒక డిఫరెంట్ సినిమా కాబట్టి, ఇప్పుడు ఉన్న ట్రెండ్ కు నచ్చుతుంది. ఈ నెలాఖరులోనే ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. రాక్షసంహారం మూవీని మీరంతా ఆదరించాలని కోరుతున్నా. అన్నారు.





## స్పిరిట్ కోసం వేచి చూస్తున్నా

### "ధురంధర్ ది రివేంజ్" డైరెక్టర్ ఆదిత్యధార్



ప్రభాస్ ను లెజెండ్ అని పిలుస్తూ, ఆయన స్పిరిట్ సినిమా థియేటర్స్ లో చూసేందుకు వేచి చూస్తున్నానంటూ సోషల్ మీడియా పోస్ట్ చేశారు ధురంధర్ మూవీ డైరెక్టర్ ఆదిత్య ధార్. దర్శకుడు సందీప్ వంగా ధురంధర్ ది రివేంజ్ సినిమాను అప్రిషియేట్ చేస్తూ చేసిన పోస్ట్ కు రిప్లై ఇచ్చిన ఆదిత్య ధార్... లెజెండ్ ప్రభాస్ కు నా ప్రేమను తెలియజేయండి అంటూ తన రిప్లై లో పేర్కొన్నారు. ఈ పోస్ట్ నేపథ్యంలో ఆదిత్యధార్, ప్రభాస్ కాంబోలో ఓ క్రేజీ మూవీ వస్తే ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు మొదలయ్యాయి.

ధురంధర్ ది రివేంజ్ మూవీ బాక్సాఫీస్ వద్ద విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటిదాకా ఈ చిత్రానికి 1680 కోట్ల రూపాయల వరల్డ్ వైడ్ వసూళ్లు దక్కాయి. ఈ సినిమా ప్రాపగండా మూవీ అంటూ బాలీవుడ్ లో కొందరు చేస్తున్న విమర్శలపై కౌంటర్ ఇస్తూ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పోస్ట్ చేశారు. అలాంటి ప్రాపగండా మూవీస్ చేసే వాళ్లే నిజాయితీగా నిజాన్ని చెబుతూ రూపొందించే ధురంధర్ ది రివేంజ్ వంటి మూవీస్ పై విష ప్రచారం చేస్తారని సందీప్ తన పోస్ట్ లో పేర్కొన్నారు. ఈ పోస్ట్ కు డైరెక్టర్ ఆదిత్య ధార్ థ్యాంక్స్ చెబుతూ తను నమ్మిన కంటెంట్ ను తీసి తన అభిప్రాయాలపై బలంగా నిలబడే సందీప్ వంగా స్ఫూర్తిగా నిలుస్తారంటూ రిప్లై ఇచ్చారు.



## రంజీ ఫస్ట్ లుక్ రిలీజ్

ఆర్యా హీరోగా పోలూరు కృష్ణ దర్శకత్వంలో స్పోర్ట్స్ యాక్షన్ థ్రిల్లర్ రూపొందుతోంది. అకృతి నంద సమర్పణలో శ్రీ విజయ వారాహి మూవీస్ బ్యానర్ పై మురుకుంట్ల అరవింద్ & విజయ భారతి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. హీరో ఆర్యా బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'రంజీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఇంటెన్స్, పవర్‌ఫుల్ ప్రెజెన్స్ తో కనిపించిన ఆర్యా ఫస్ట్ లుక్ ఆకట్టుకుంది. ఆయన ధరించిన క్యాజువల్ కాస్ట్యూమ్ ఈ లుక్‌కు మరింత రియలిస్టిక్, రిలేటబుల్ వైబ్ తీసుకొచ్చింది. పాత్ర ఎంత ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉండబోతుందో ఈ ఫస్ట్ లుక్ స్పష్టంగా తెలియజేస్తోంది.

## 15న ఓ సుందరి రిలీజ్

సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తోంది. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బలమైన కథాంశాలతో, కంటెంట్ బేస్డ్ తెలుగు సినిమాలకు మద్దతుగా నిలిచే ఈ రెండు నిర్మాణ సంస్థలకు 'రావు బహదూర్' మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా నిలవనుంది. టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత, టీం ఇప్పుడు మ్యూజిక్ ప్రమోషన్స్ కిక్ స్టార్ట్ చేస్తున్నారు. స్మరణ్ సాయి స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'ఓ సుందరి' ఏప్రిల్ 15న విడుదల కానుంది. సత్యదేవ్, దీపా థామస్‌లను రొమాంటిక్ సెటప్‌లో ప్రజెంట్ చేసిన సాంగ్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆకట్టుకుంది. సత్యదేవ్ పొడవాటి జుట్టు, కళ్ళద్దాలతో రెట్రో కూల్ లుక్‌లో కనిపిస్తుండగా, దీప ఎంతో హుందాగా, ప్రశాంతంగా కనిపిస్తుంది. ఈ బ్యాక్ డ్రాప్ సున్నితమైన లవ్ మెలోడీని సూచిస్తున్నాయి.



## 24న గేదెలరాజు విడుదల



రఘుకుంచే టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'గేదెలరాజు'. కాకినాడ తాలుకా సినిమా ట్యాగ్‌లైన్. రఘుకుంచే తో పాటు రామచంద్రం పుణ్యమూర్తుల, వికాస్, టీనా శ్రావ్య, మౌనిక, రవి చిన్నిబిల్లి తదితరులు నటించిన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు విడుదలై మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. మొదటగా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 17న విడుదల చేద్దామనుకున్నారు చిత్ర నిర్మాత దర్శకుడు చైతన్య మోటూరి. ఏప్రిల్ 17న దాదాపు తొమ్మిది సినిమాలు విడుదలకు సిద్ధమవ్వటంతో సినిమా హక్కులు కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్స్ సలహా మేరకు ఈ చిత్రాన్ని మరో వారం రోజుల తర్వాత అంటే ఏప్రిల్ 24న సినిమా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ తెలియచేశారు. ఈ చిత్రం ట్రైలర్‌కి అనూహ్యమైన స్పందన రావటంతో రఘు కుంచే, చైతన్య మోటూరిలు మాట్లాడుతూ- "కంటెంట్ ఉన్న సినిమాను పది సినిమాల మధ్యలో విడుదల చేసి ఆ సినిమా అస్థిత్వాన్ని కోల్పోయేలా చేయకూడదు అన్న ఒకే ఒక ఉద్దేశ్యంతో సినిమాను మరుసటి వారానికి వాయిదా వేస్తున్నామన్నారు. అలాగే సినిమా ట్రైలర్ చూసిన ఒక్కొక్కరు ట్రైలర్ చాలా కొత్తగా ఉంది అని ప్రతి ఒక్కరు నలుగురికి చెప్పటంతో ఆర్గానిక్‌గా మా సినిమాకి చక్కని బజ్ ఏర్పడింది అన్నారు".

## రేజర్ మే 8న రిలీజ్

తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్ గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు తన గత చిత్రాల కన్నా భిన్నమైన ఇంటెన్స్ వైలెంట్ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ 'రేజర్' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు సమర్పిస్తుండగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం, రవిబాబు తండ్రి దివంగత చలపతిరావు జయంతి సందర్భంగా, మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. 'ఎనుగుతోండం ఘటికాచలం' వంటి లైట్ టోన్ చిత్రంతో అలరించిన రవిబాబు, ఇప్పుడు 'రేజర్'తో టెన్షన్, సైకాలజికల్ వైలెంట్ యాక్షన్ తో కూడిన డార్క్ ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు. దర్శకుడిగానే కాకుండా ప్రధాన పాత్రలోనూ నటిస్తూ, ఈ సినిమాకు తనదైన రా టచ్ ఇచ్చారు. టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే మంచి హైప్ తెచ్చుకున్న 'రేజర్', తాజాగా విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్‌తో మరింత ఆసక్తి రేపుతోంది. రవిబాబు టెర్రిఫిక్ గా కనిపించి థ్రిల్ కలిగించారు. తాజాగా విడుదలైన పోస్టర్లు సినిమాకి ఉన్న డార్క్ టోన్‌ను మరింత బలంగా చూపిస్తున్నాయి. నగర అల్లకల్లోలం, ఇండస్ట్రియల్ షాడోస్ మధ్య రవిబాబు ఇంటెన్స్ లుక్‌లో కనిపించగా, ఒక పోస్టర్‌లో చిన్నారి తో కలిసి వీధిలో నడుస్తూ కనిపించడం కథలో ఎమోషనల్ యాంగిల్ కూడా ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది. ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. డబ్బింగ్ పనులు కూడా పూర్తి కాగా, ఫైనల్ ఫినిషింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి.



## ఎన్నో నేర్చుకున్నా

నటి మంజు వారియర్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన లద్దాఖ్ బైక్ ట్రిప్ విశేషాలను గుర్తు చేసుకున్నారు. అజిత్ కుమార్‌తో కలిసి 14 రోజుల పాటు సాగిన ఈ ప్రయాణం తనకు ఎన్నో విషయాలు నేర్పిందన్నారు. "అజిత్‌తో కలిసి చేసిన ఆ రైడ్ నా కళ్లు తెరిపించింది. లద్దాఖ్‌లో వాళ్ల టీమ్‌ను కలిశాను. సుమారు 14 రోజుల పాటు వారితో కలిసి ప్రయాణించాను. అజిత్ కుమార్ ఎన్నో విషయాలు నేర్పారు. ఒకవేళ మనకు ప్రమాదం జరిగితే, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి అనేది మొదటిరోజే చెప్పారు. నాకు బైక్ నడపడం వచ్చు కానీ, అప్పట్లో నా దగ్గర లైసెన్స్ లేదు. వారంతా ప్రొఫెషనల్ రైడర్స్ కావడంతో వారితో కలిసి మేనేజ్ చేయడం నాకు కొత్తగా అనిపించింది. ఆ ట్రిప్ పూర్తయ్యాక నేను లైసెన్స్ తీసుకున్నాను" అని మంజు చెప్పారు. అజిత్‌కు సినిమాలు అంటే ఎంత ఇష్టమో మోటార్ రేసింగ్ కూడా అంతే ఇష్టం. ఎన్నోసార్లు రేసింగ్ పోటీల్లో పాల్గొన్నారు. 'అజిత్ కుమార్ రేసింగ్' పేరుతో టీమ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. మంజు వారియర్, అజిత్ కలిసి 'తునివు' (తెలుగులో తెగింపు)లో నటించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరిద్దరూ కలిసి లద్ధాఖ్ ట్రిప్‌నకు వెళ్లారు.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.